ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 184

ఆదివారం 12 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## పవన్ కల్యాణ్‌కు మూడున్నర గంటలపాటు శస్త్రచికిత్స..



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 11)

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శనివారం ముంబయిలో శస్త్రచికిత్స జరిగింది. ఇటీవల వైద్యపరీక్షలు చేయించుకున్నప్పుడు ఆయన రెండు భుజాలకు రొటేటర్ కఫ్ గాయాలు ఉన్నాయని.. కండరాలు పూర్తిగా చిట్లడంతో శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించారు. రెండు భుజాలకూ ఒకేసారి శస్త్రచికిత్స చేస్తే నొప్పి తీవ్రత ఎక్కువగా ఉంటుందని.. ప్రస్తుతానికి కుడి భుజానికి చేశారు. దీనికి మూడున్నర గంటల సమయం పట్టిందని.. రెండు నెలల వ్యవధిలో మరో సర్జరీ చేయాల్సి ఉంటుందన్నారు. పవన్ త్వరగా కోలుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు

2

## ప్రముఖ గాయని ఎస్.జానకి కన్నుమూత

(షణ్ముఖ వెలుగు, మైసూరు,జూలై 11)

ప్రముఖ గాయని ఎస్.జానకి కన్నుమూశారు. మైసూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 88 సంవత్సరాలు. వయోధిక సమస్యలతో ఆమె కన్నుమూసినట్లు మనవరాలు అప్సర విద్యుల ఇన్‌స్టా వేదికగా ప్రకటించారు. దక్షిణ భారత గానకోకిలగా పేరుగాంచిన జానకి అన్ని భాషల్లో కలిపి దాదాపు 50 వేలకు పైగా పాటలను పాడారు. 1938 ఏప్రిల్ 23న గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్లపట్ల గ్రామంలో ఎస్.జానకి జన్మించారు. తెలుగు చలన చిత్రసీమలో ఆణిముత్యాల్లాంటి పాటలకు ఆమె ప్రాణం పోశారు. తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో అద్భుతమైన పాటలను ఆలపించారు.



## ఏపీఈడీబీలో కొరియా డెస్క్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 11)

దక్షిణ కొరియాతో ఏపీ బంధాన్ని మరింత పటిష్ఠపరిచేందుకు ఏపీఈడీబీలో కొరియా డెస్క్, ఉమ్మడి వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయనున్నట్లు ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా ఆటో ఇండస్ట్రీస్ కోఆపరేషన్ ఏజెన్సీ ఛైర్మన్ టేక్ సుంగ్‌లీ నేతృత్వంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. 'ఏపీలో ఆటోమోటివ్ ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నాం. దీనిలో భాగంగా గ్రీన్ కారిడార్లలో ప్రతి 30 కిలో మీటర్లకు ఛార్జింగ్ స్టేషన్లు, పుంగనూరులో ఈవీ క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నాం. శ్రీసిటీ-చిత్తూరు- తిరుపతి కారిడార్ ▶మిగతా 2లో



# 'హిట్..రన్ అండ్ ఎస్కేప్'... ఇదే జగన్ నైజం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 11)

'హిట్, రన్ అండ్ ఎస్కేప్ అనేది గొడ్డలి పార్టీ అధినేత నైజం' అని సీఎం చంద్రబాబు విమర్శించారు. నేరపూరిత మనస్తత్వం ఉండేవారు సోషల్ మీడియాను వేదికగా చేసుకుంటున్నారని, ప్రభుత్వాన్ని, నేతలను లక్ష్యంగా చేసుకొని విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం చంద్రబాబు మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఇక్కడ సంఘటనలు చేయించి.. జగన్ బెంగళూరు వెళ్లి దాక్కుంటున్నారని ఎద్దేవా చేశారు.

" ఏదో ఒక అరాచకానికి.. తెదేపా నేతలను బాధ్యుల్ని చేయాలని చూస్తున్నారు. ఈ సైకోయిజానికి.. ఆధ్యాత్మికత, టెక్నాలజీ పరిష్కారం చూపిస్తాయి. ఇలాంటి సైకో మనస్తత్వమే ఇవాళ తెలంగాణలో ఆరుగురి హత్యకు దారితీసింది. పోక్సో కేసు పెట్టారని.. కేసు పెట్టిన వారిని చంపేశాడు. తనకు సహకరించలేదని సొంత కుటుంబ సభ్యుల్నీ చంపేశాడు. గొడ్డలి పార్టీ అధినేతకూ, ఈ హంతకుడి మనస్తత్వానికి దగ్గర పోలికలు ఉన్నాయి. ఇద్దరి మనస్తత్వాలు ఇంచుమించు ఒక్కటే. కన్న తల్లి, సొంత చెల్లి, బాబాయ్ వ్యవహారాలు చూశాం. జగన్ నమ్ముకుంది గొడ్డలి,

2



## మోదీకి న్యూజిలాండ్ గడ్డపై 'హాకా' నృత్యంతో స్వాగతం...

న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

మావోరీ ఆదివాసీల 'హాకా' నృత్యంతో ఘన స్వాగతం

40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌కు వెళ్లిన తొలి భారత ప్రధాని

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 11)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి న్యూజిలాండ్ పర్యటనలో అపూర్వ గౌరవం లభించింది. సుమారు 40 ఏళ్ల తర్వాత ఓ భారత ప్రధాని న్యూజిలాండ్‌లో పర్యటించడం ఇదే ప్రథమం. ఆక్లాండ్‌లోని గవర్నమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీకి ఆ దేశ ఆదిమవాసీ మావోరీ తెగ తమ సాంప్రదాయ 'హాకా' నృత్యంతో గంభీరంగా స్వాగతం పలికింది. శక్తివంతమైన కదలికలు, ప్రత్యేకమైన హావభావాలతో ప్రదర్శించే 'హాకా' నృత్యం, తమ దేశానికి వచ్చిన గౌరవనీయ అతిథులకు స్వాగతం పలకడానికి, బలం, ఐక్యతకు చిహ్నంగా మావోరీలు ప్రదర్శిస్తారు. అనంతరం న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టఫర్ లక్సన్, మోదీని ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని ఆహ్వానించారు. ఈ పర్యటనలో ఇరు దేశాల నాయకులు ద్వైపాక్షిక సంబంధాలను 'వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచుతున్నట్లు ప్రకటించారు. దీనికోసం ▶మిగతా 2లో



## 'జమిలి'కి రంగం సిద్ధం.. వేగంగా పావులు కదుపుతున్న జేపీసీ

2029 నాటికి 'ఒకే దేశం, ఒకే ఎన్నిక'

అమలు సాధ్యమని జేపీసీ ఛైర్మన్ సంకేతం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 11)

దేశవ్యాప్తంగా 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' (జమిలి ఎన్నికలు) విధానాన్ని 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి అమలులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు పార్లమెంటరీ సంయుక్త కమిటీ (జేపీసీ) ఛైర్మన్ పీపీ చౌదరి వెల్లడించారు. లోక్‌సభతో పాటు రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే అంశంపై ఏర్పాటైన ఈ కమిటీ, ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వివిధ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. గోవాలో జరిగిన జేపీసీ రెండు రోజుల సమావేశం ముగింపు సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సంస్కరణ అమలులో ఎదురయ్యే సవాళ్లపై గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, ఆయన మంత్రివర్గ సహచరులతో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ఈ విధానంపై అన్ని రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం సాధించడమే తమ ప్రధాన లక్ష్యమని చౌదరి స్పష్టం చేశారు. తరచూ ఎన్నికలు నిర్వహించడం వల్ల దేశ ఖజానాపై సుమారు రూ. 7 లక్షల కోట్ల మేర భారీ ఆర్థిక భారం పడుతోందని ఆయన వివరించారు. ఎన్నికల నియమావళి (కోడ్) కారణంగా అభివృద్ధి పనులు కుంటుపడటంతో పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన వంటి కీలక రంగాలు ప్రభావితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము సంప్రదించిన వారిలో సుమారు 99 శాతం మంది పౌర సమాజ ▶ 2లో

## సామాజిక మాధ్యమాల పోస్టుల కట్టడికి...

ఇతర దేశాల్లో ఉత్తమ విధానాలపై అధ్యయనం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 11)

సామాజిక మాధ్యమాల ద్వారా రాజకీయ ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం, అసత్య ప్రచారాలు, అసభ్యకర పోస్టులు, ద్వేషపూరిత వ్యాఖ్యల్లాంటి చర్యలను నియంత్రించేందుకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ▶ 2లో



## కొరియా నైపుణ్యం.. ఏపీ సామర్థ్యం

ఏపీపై మీ విశ్వాసానికి కియా ప్లాంటే నిదర్శనం

కొరియాలో సీఐఐ భాగస్వామ్య సదస్సు రోడ్ షోలో మంత్రి లోకేశ్

దక్షిణకొరియాలో సీఐఐ భాగస్వామ్య సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 11)

'ఆంధ్రప్రదేశ్ ఏటా సుమారు 21 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను ఎగుమతి చేస్తోంది. వెయ్యి కిలోమీటర్లకు పైగా సముద్ర తీరం, నౌకాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లు, విద్యుత్తు, అనువైన భూమి ధరలు, నైపుణ్యం కలిగిన మానవవనరులు, ప్రకటనల కంటే అమలుకే ప్రాధాన్యమిచ్చే ప్రభుత్వం మా బలాలు. కొరియా సాంకేతిక నైపుణ్యం ఏపీ విస్తృత సామర్థ్యంతో కలిస్తే ▶ 2లో

## భోగాపురం టేకాఫ్‌కు సిద్ధం.. ఏరోడ్రోమ్‌లైసెన్స్ అందజేత

రామ్మోహన్‌నాయుడు సమక్షంలో భోగాపురం విమానాశ్రయ ఏరోడ్రోమ్ లైసెన్స్‌ను జీఎంఆర్ ప్రతినిధులకు అందజేస్తున్న పౌరవిమానయానశాఖ అధికారులు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 11)

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం టేకాఫ్‌కు సిద్ధమైందని పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఈ మేరకు విమానాలు రాకపోకలు సాగించడానికి వీలుగా దిల్లీలో జీఎంఆర్ సంస్థకు ఏరోడ్రోమ్ లైసెన్స్‌ను అందజేశారు. 'భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఏరోడ్రోమ్ లైసెన్స్‌ను అందజేయడం నాకు ఎంతో గర్వకారణం. ▶ 2లో

## బోటు బోల్తా ఘటన.. భారత ఎంబసీ అధికారులతో మాట్లాడిన మంత్రి లోకేశ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 11)

వియత్నాంలో పర్యాటక బోటు బోల్తా పడిన ఘటనలో ఏపీ వాసులు మృతి చెందిన నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ స్పందించారు. వియత్నాంలోని భారత ఎంబసీ అధికారులతో మాట్లాడారు. బాధితులకు తక్షణ సాయం అందేలా చూడాలని కోరారు. ప్రమాదంలో చిక్కుకున్న తెలుగువారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

మరోవైపు దిల్లీలోని ఏపీ భవన్ అధికారులతోనూ మంత్రి నారా లోకేశ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ▶ 2లో

## మత విద్వేషాల వెనుక తాడేపల్లి ప్యాలెస్ స్కెచ్

జోసెఫ్ రావణ్, జడ శ్రావణ్‌కుమార్, నటుడు ప్రకాశ్‌రాజ్ వైకాపా ఏజెంట్లు

రూ.25 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో శ్రావణ్‌కుమార్ సమాధానం చెప్పాలి: మంత్రి దుర్గేష్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 11)

గన్నవరం విమానాశ్రయంలో మాజీ సీఎం జగన్‌ను యూట్యూబర్ రావణ్ స్నేహితురాలు గగన కలిసి మద్దతు కోరటం, ఆ బాధ్యతలను వైకాపా నేత దేవినేని అవినాష్‌కు జగన్ అప్పగించటం ద్వారా క్రైస్తవులను రెచ్చగొట్టి రాష్ట్రంలో మతఘర్షణలు సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారనే విషయం బహిర్గతమవుతోందని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. జోసెఫ్ రావణ్ నాస్తికుడైతే అన్నిమతాలను సమానంగా చూడాలని, హిందూ దేవతలు, సనాతన ధర్మాన్ని కించపరిచేలా మాట్లాడటం వెనుక రాజకీయ స్వార్థం ఉందని ఆయన మండిపడ్డారు. జోసెఫ్ రావణ్, ▶ 2లో

## మొదటిపేజీ తరువాయి

# ‘హిట్..రన్ అండ్ ఎస్కేప్’.. ఇదే జగన్ నైజం

సోషల్ మీడియా ద్వారా విష ప్రచారమే. ప్రజలకు సాంకేతికతతో పాటు ఆధ్యాత్మికత ఎంతో అవసరం. అప్పుడే ఏది నిజమో తెలుసుకొని.. మంచి, చెడులు బేరీజు వేసుకోగలరు. గొడ్డలి పార్టీ అధినేత కుటుంబ చరిత్ర మొత్తం నేర స్వభావమే. తాత ముత్తాతల నుంచి ఇదే వైఖరి కొనసాగుతోంది. ఆ పార్టీ నేతల చరిత్ర కూడా అలాగే తయారవుతోంది.

జగన్ ఎన్ని కుట్రలు పన్నినా భోగాపురం విమానాశ్రయం పూర్తయిపోయింది. అమరావతి, పోలవరం, వెలిగొండ పూర్తవుతున్నాయి. జగన్ .. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మావిగన్ పేరుతో పారిశ్రామిక వేత్తలను గందరగోళానికి గురి చేయాలనుకుంటున్నారు. బ్రాహ్మణి స్టీల్స్ దోపిడీ కథ ఇంతటితో ఆగలేదు. బ్రాహ్మణి స్థలం సమస్యకే ప్రస్తుతానికి ఇన్నేళ్లకు చెక్ పడింది. ఆ పరిశ్రమ వల్ల ఓబుళాపురం మైనింగ్ బ్లాక్ అయ్యింది. అలా జరగకుండా ఉంటే.. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వచ్చేవి. 4 సిమెంట్ ఫ్యాక్టరీలు, పరిశ్రమలు వచ్చేవి. పెండింగ్‌లో ఉన్న లేపాక్షి భూముల సమస్యకు కూడా త్వరలోనే పరిష్కారం చూపిస్తాం. లక్షల కోట్ల రాష్ట్ర సంపద దోపిడీ కోసం.. అభివృద్ధికి అడ్డుకట్టవేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం గొడ్డలి పార్టీ అధినేతకు ఇష్టం లేదు. కేవలం నాకు పేరు వస్తుందనే అక్కసుతో ప్రతిదీ అడ్డుకోవాలని చూస్తున్నారు” అని చంద్రబాబు అన్నారు.

# పవన్ కల్యాణ్‌కు మూడున్నర గంటలపాటు శస్త్రచికిత్స..

ఎక్స్‌లో పోస్టు పెట్టారు.‘గబ్బర్ సింగ్’ సినిమా షూటింగ్ సమయంలో పవన్‌కు దెబ్బలు తగిలాయి. 2019లో రాయలసీమ జిల్లా పర్యటనలోనూ, వారాహి యాత్ర సమయంలోనూ ఆయనకు గాయాలు అయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో పవన్ ముక్కుకి శస్త్ర చికిత్స చేసే సందర్భంలో పలు వైద్య పరీక్షలు నిర్వహించగా.. రొటేటర్ కఫ్ గాయాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. పవన్‌కు శస్త్రచికిత్స విజయవంతం అయినందుకు ఎంతో సంతోషంగా ఉందని నిర్మాత బండ్ల గణేశ్ పోస్ట్ పెట్టారు. ఆయన తర్వగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# మోదీకి న్యూజిలాండ్ గడ్డపై ‘హాకా’ నృత్యంతో స్వాగతం...

‘రోడ్‌మ్యాప్ టు 2030’ను కూడా ఆవిష్కరించారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సాంకేతికత, వ్యవసాయం, విద్య, పర్యాటకం వంటి రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ప్రజల మధ్య సంబంధాలను పెంపొందించే దిశగా భారత్, న్యూజిలాండ్ మధ్య రెండు స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్‌ల సిరీస్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కాగా, ప్రధాని మోదీకి హాకా నృత్యంతో స్వాగతం పలుకుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# భోగాపురం టేకాఫ్‌కు సిద్ధం.. ఏరోడ్రోమ్‌లైసెన్స్ అందజేత

ఈ లైసెన్స్ కేవలం ఒక విమానాశ్రయానికి కాదు, ఉత్తరాంధ్రను ఉత్తమాంధ్రగా తీర్చిదిద్దే అభివృద్ధి యుగానికి నాంది. ప్రపంచస్థాయి ఏరోట్రోపోలిస్‌గా రూపుదిద్దుకుంటున్న భోగాపురం చుట్టూ ఎయిర్‌కార్గో, విమాన నిర్వహణ కేంద్రాలు, కన్వెన్షన్ సెంటర్లు, హోటళ్లు, బిజినెస్ పార్కులు, వాణిజ్య సముదాయాలూ ఏర్పడి పెట్టుబడులు, ఉపాధి, పర్యాటకం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త దిశను చూపనున్నాయి” అని ఆయన ‘ఎక్స్’లో పేర్కొన్నారు.

### విమానాశ్రయానికి రూ. 85 లక్షలు కేటాయింపు

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రహరీ వెంట సీసీ డ్రెయిన్ నిర్మాణానికి రూ. 85 లక్షలు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ ఎండీని ఆదేశించింది.

# ‘జమిలి’కి రంగం సిద్ధం.. వేగంగా పావులు కదుపుతున్న జేపీసీ

ప్రతినిధులు జమిలి ఎన్నికల ప్రతిపాదనకు పూర్తి మద్దతు తెలిపారని ఆయన పేర్కొన్నారు.

కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా అంగీకరిస్తే, 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉంటుందని చౌదరి తెలిపారు. దీనికి సంబంధించి 129వ రాజ్యాంగ సవరణ బిల్లు-2024తో పాటు ఇతర అనుబంధ బిల్లులను 39 మంది సభ్యులతో కూడిన జేపీసీ కూలంకషంగా పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లోని నిపుణులు, విద్యావేత్తలతో కమిటీ సంప్రదింపులు జరిపినట్లు ఆయన వెల్లడించారు.

# సామాజిక మాధ్యమాల పోస్టుల కట్టడికి...

మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. దీన్ని నియంత్రించేందుకు ప్రత్యేక చట్టం తేవాలా? ఇతర దేశాల్లో ఎలాంటి చట్టాలు ఉన్నాయి? అక్కడ అనుసరిస్తున్న ఉత్తమ విధానా లేంటనే అంశాలపై అధ్యయనం చేయాలని నిర్ణయించిందని తెలిపారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు అంశాలపై జరిగిన చర్చలు, తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వివరించారు. ‘సోషల్ మీడియా దుర్వినియోగంపై మంత్రివర్గ సమావేశంలో విస్తృతస్థాయిలో చర్చ జరిగింది. ఇటీవలి కాలంలో సోషల్ మీడియా వెర్రితలలు వేస్తోంది. వాటికి బాధ్యత లేదు. పాలనా వ్యవస్థ, మనుషుల ఆలోచనా విధానాన్ని మార్చేలా సోషల్ మీడియా ప్రభావం చూపుతోంది. ప్రింట్, టీవీ నెట్‌వర్క్ లాంటి సంప్రదాయ మీడియాకు చట్టపరమైన జవాబుదారీతనం, నైతిక ప్రమాణాలు ఉన్నాయి’ అని మంత్రి పేర్కొన్నారు.

### కఠిన చర్యలు తీసుకుంటాం

మహిళలు, మైనర్లపై సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న అవమానకర ప్రచారం, అసభ్యకర పోస్టుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి హెచ్చరించారు. ‘ప్రజాప్రతినిధులు, మంత్రులు, ప్రజాజీవితంలో ఉన్న ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దుష్ప్రచారంపైనా చర్యలు తీసుకుంటాం’ అని పేర్కొన్నారు. దీనికోసం..

# కొరియా నైపుణ్యం.. ఏపీ సామర్థ్యం

అద్భుతాలు చేయొచ్చు’ అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. నవంబరులో ఏపీలో నిర్వహించే సీఐఐ భాగస్వామ్య సదస్సుకు రండి.. పరిశ్రమల ఏర్పాటులో మా వేగాన్ని పరిశీలించండి అని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా సియోల్‌లో సీఐఐ భాగస్వామ్య సమిట్, కొరియా పారిశ్రామికవేత్తలతో శుక్రవారం నిర్వహించిన రోడ్ షోలో లోకేశ్ మాట్లాడారు. ‘ఏపీ అభివృద్ధిలో కొరియా కంపెనీలు భాగస్వామ్యం కావాలి. ప్రపంచాన్ని ఏపీకి తీసుకురావడం, ఏపీని ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా రెండేళ్లలో దావోస్, సింగపూర్, జపాన్, రష్యా, మధ్యప్రాచ్యం, యూరప్ దేశాల్లో పర్యటించాం. కేవలం ఎంఓయూలు కుదుర్చుకోవడమే కాదు.. శాశ్వతంగా నిలిచే భాగస్వామ్యాలను నిర్మించడమే మా లక్ష్యం. ఏపీలో 35కి పైగా కొరియా కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి’ అని వెల్లడించారు.

### భారత్- కొరియా వాణిజ్యంలో ఏపీ కీలకపాత్ర

2030నాటికి భారత్- కొరియా వాణిజ్యాన్ని రూ. 4.77 లక్షల కోట్ల (50 బిలియన్ డాలర్ల)కు చేర్చాలని రెండు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని.. ఇందులో ఏపీ ముఖ్య భూమిక పోషించాలని కోరుకుంటోందని లోకేశ్ చెప్పారు. ఏపీ- కొరియా భాగస్వామ్యంలో తొలి అధ్యాయాన్ని అనంతపురంలో కియా మోటార్స్‌తో ఆటోమొబైల్ రంగంలో లిఖించామని గుర్తు చేశారు. కియా మోటార్స్ ఏపీని ఎంచుకోవడం తమపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమన్నారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ తన మూడో ఉత్పత్తి ప్లాంట్ కోసం శ్రీసిటీని ఎంపిక చేయడంతో రెండో అధ్యాయం ఎలక్ట్రానిక్స్ రంగంలో కొనసాగుతోందన్నారు. మనమందరం కలిసి మూడో అధ్యాయాన్ని సెమీకండక్టర్లు, షిప్‌బిల్డింగ్, ఏఐ, క్లీన్ ఎనర్జీ, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగాల్లో లిఖించబోతున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ కొరియాలో భారత రాయబారి గౌరంగలాల్ దాస్, కొరియా విదేశాంగ శాఖ ఆసియా, పసిఫిక్ వ్యవహారాల బ్యూరో డైరెక్టర్ జనరల్ లీమిన్- క్యోంగ్, ఇన్వెస్ట్ కొరియా కమిషనర్ డా. కిమ్ టే హ్యూంగ్, సీఐఐ ఏపీ ఛైర్మన్ నరేంద్రకుమార్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ శ్రీసిటీ ఫ్యాక్టరీ ప్రాజెక్టు లీడర్ సంగ్ హియో తదితరులు పాల్గొన్నారు.

# బోటు బోల్తా ఘటన.. భారత ఎంబసీ అధికారులతో మాట్లాడిన మంత్రి లోకేశ్

వియత్నాంలోని భారత ఎంబసీతో మాట్లాడుతున్నట్లు అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో బాధితులకు సాయం అందించాలని లోకేశ్ సూచించారు. బాధితుల సమాచారం కోసం అక్కడి ప్రభుత్వం కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. 084 362817930, 084 915523714, 084 334520414, 084 913089165 నంబర్లలో సంప్రదించాలని కోరింది.

పడవ ప్రమాద ఘటనలో మొత్తం 15 మంది మృతి చెందగా.. 21 మంది అస్వస్థతకు గురయ్యారు. వియత్నాంలోని ఫూ క్వాక్ ద్వీపం సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఓ మొబైల్ కంపెనీ భారత్‌కు చెందిన డిస్ట్రిబ్యూటర్ల కుటుంబాలను వియత్నాం పర్యటనకు తీసుకెళ్లింది. మొత్తం 250 మందిని తీసుకెళ్లగా.. అందులో ఏపీకి చెందిన 35 మంది, తెలంగాణకు చెందిన 40 మంది ఉన్నారు.

# మత విద్వేషాల వెనుక తాడేపల్లి ప్యాలెస్ స్కెచ్

జడ శ్రావణ్‌కుమార్, నటుడు ప్రకాశ్‌రాజ్ ముసుగులు వేసుకుని వైకాపా ఏజెంట్లుగా పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వంపై పోరాటానికి రూ. 25 కోట్లు వెచ్చించానంటున్న జడ శ్రావణ్‌కుమార్‌కు అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి దుర్గేష్ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ‘కుట్రల వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారులను బయటికి తీసేందుకు పోలీసులు అంతర్జాతీయ నిధుల సాయం కోణంలో లోతుగా విచారణ జరపాలి. ఏలూరులో ఇటీవల నిర్వహించిన దళిత క్రైస్తవ శంఖారావం సభ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు చేయటానికే పరిమితమైంది. ఉప ముఖ్యమంత్రిని రాజకీయంగా ఎదుర్కోలేక తాడేపల్లి ప్యాలెస్ నుంచి వస్తున్న స్క్రిప్ట్‌తో ఈ ముఠా అభ్యంతరకర భాషతో దూషిస్తోంది. సభలో ఎక్కడా దళితులు, క్రైస్తవుల సంక్షేమం గురించి చర్చించకపోవటమే వీరి కుట్రకు నిదర్శనం’ అని మంత్రి దుర్గేష్ మండిపడ్డారు.

‘న్యాయవాద వృత్తిలో స్థిరత్వం లేని వ్యక్తి జడ శ్రావణ్‌కుమార్. గతంలో సుగాలి ప్రీతి తల్లిని మోసగించిన చరిత్ర ఆయనది. ప్రస్తుతం ప్యాకేజీలకు లొంగి మాట్లాడుతున్నారు. ఉపా కేసులో అరెస్టయిన రావణ్ వెనుక పూర్తిస్థాయిలో వైకాపా ఉంది. నటుడు ప్రకాశ్‌రాజ్ కర్ణాటకలోని పవిత్ర ధర్మస్థల పుణ్యక్షేత్రం, అక్కడి ఆచారాలపై కుట్రలు పన్నారు. ఇప్పుడు ఏపీలో అడుగుపెట్టి మతవిద్వేషాలు రేకెత్తించేందుకు రావణ్‌తో చేతులు కలిపారు’ అని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.

# ఏపీఈడీబీలో కొరియా డెస్క్

వెంబడి ప్రత్యేక కొరియన్ ఆటో కాంపోనెంట్స్ పార్కులు అభివృద్ధి చేస్తాం. ఉమ్మడి టూలింగ్, టెస్టింగ్ సౌకర్యాలు, పూర్తిస్థాయి సదుపాయాల కోసం ఒక కొరియా డెస్క్ ఏర్పాటు చేస్తాం’ అన్నారు.

ఏపీలోని శ్రీసిటీ లేదా తిరుపతిలో గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కుకూ ఎలక్ట్రానిక్స్ ఓవర్సీస్ సేల్స్, మార్కెటింగ్ హెచ్ఓడీ చో హన్ చుల్‌ను లోకేశ్ కోరారు. పరిశీలిస్తామని చుల్ చెప్పారు. రాష్ట్రంలో ఈవీ విడిభాగాలు, ఇంటిగ్రేటెడ్ మాడ్యుల్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని మోటివ్ లింక్ సీఈఓ కిమ్ కి-హాన్, అంతర్జాతీయ విక్రయాలు, పరిశోధన జనరల్ మేనేజర్ బైద్య శర్మలను లోకేశ్ కోరారు. పరిశీలిస్తామని కి-హాన్ హామీ ఇచ్చారు. ఏపీలో సముద్ర రవాణా, షిప్ బిల్డింగ్‌లో పెట్టుబడులు పెట్టాలని హెచ్‌డీ కొరియా షిప్‌బిల్డింగ్, ఆఫ్‌షోర్ ఇంజినీరింగ్ గ్లోబల్ బిజినెస్ డైరెక్టర్ క్వోన్ యంగ్వాన్, టీమ్ లీడర్ హోంగ్ సున్జూన్‌లను మంత్రి లోకేశ్ కోరారు. ఏపీలో అనుకూల ప్రాంతాలు గుర్తించి తెలియజేస్తామని క్వోన్ యంగ్వాన్ అన్నారు. ఏపీలో బెస్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని డెల్టా ఎక్స్ ఫౌండర్, సీఈఓ స్టీఫెన్ కిమ్‌తో భేటీలో లోకేశ్ విజ్ఞప్తి చేశారు. త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని కిమ్ చెప్పారు.

అమరావతి లేదా విశాఖపట్నంలో ప్రత్యేక కోట్రా కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని న్వెస్ట్ కొరియా సంస్థ కమిషనర్ కిమ్ టే హ్యూంగ్‌ను లోకేశ్ కోరారు. సీఐఐ భాగస్వామ్య సదస్సుకు కొరియా సంస్థలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రముఖ గాయని ఎస్.జానకి కన్నుమూత

ఆమె గాన మాధుర్యానికి నాలుగు జాతీయ అవార్డులు సహా, వివిధ సినీ అవార్డులు వరించాయి. సంగీత ప్రపంచానికి జానకి చేసిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. 2013లో పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. లెజెండరీ గాయకులు ఘంటసాల నుంచి బాలసుబ్రహ్మణ్యం వరకూ ఎంతో మంది గాయనీ గాయకులతో కలిసి ఎస్.జానకి అద్భుత గీతాలతో అలరించారు.

తెలుగు ప్రేక్షకులు ఎప్పటికీ మరిచిపోలేని పాటలను ఎస్.జానకి ఆలపించారు. తొలిసారి మిమ్మల్ని (శ్రీవారికి ప్రేమలేఖ), మంచు కురిసే వేళలో (అభినందన), అరె ఏమైందీ (ఆరాధన), బంతి చామంతి (అభిలాష), సిరిమల్లె పువ్వా (పదహారేళ్ల వయసు), మౌనమేలనోయి (సాగర సంగమం), ప్రియతమా నా హృదయమా (ప్రేమ), అందాలలో (జగదేకవీరుడు అతిలోకసుందరి), ఈ దుర్యోధన దుశ్శాసన (ప్రతిఘటన), మాటే మంత్రము (సీతాకోకచిలుక), సుందరి నీవే (దళపతి- తెలుగు వెర్షన్) వంటి సూపర్‌హిట్ సాంగ్స్ పాడారు.“ప్రియమైన అమ్మమ్మ, దిగ్గజ గాయని ఎస్.జానకి కన్నుమూశారన్న వార్త తెలియజేయడానికి ఎంతో విచారిస్తున్నా. కుటుంబ సభ్యుల ప్రేమ, ఆప్యాయత మధ్య ప్రశాంతంగా మనల్ని విడిచి వెళ్లిపోయారు. ఆమె అద్భుతమైన జీవితాన్ని గడిపారు. తన గానంతో లక్షల మందికి ఆనందింపజేశారు. ఆమె ఒక దిగ్గజ గాయని. ఆమె పాటలు మధుర జ్ఞాపకాలు. ఈ దుఃఖ సమయంలో మా కుటుంబ ఏకాంతతను గౌరవించాల్సిందిగా అందరినీ కోరుతున్నా” అని అప్సర తెలిపారు.

# తాగునీటిలో జిడ్డు... ప్రజల ప్రాణాలతో చెలగాటమా..?

## దారుకానిపాడులో కలకలం
## గ్లాసులో నీళ్లు కాదు..ఆయిల్
## గ్రామస్థుల ఆవేదన
## 20 రోజులుగా కలుషిత నీరే తాగుతున్నామని ఆరోపణ
## అధికారుల నిర్లక్ష్యం పై మండిపాటు





**(షణ్ముఖ వెలుగు, గుడ్లూరు, జులై 11)**
ప్రజలకు ప్రాణాధారమైన తాగునీరు కలుషితమైందన్న ఆరోపణలు ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలం దారుకానిపాడు గ్రామంలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. గ్రామంలోని రక్షిత మంచినీటి సరఫరాలో జిడ్డు పదార్థం, ఆయిల్ మాదిరి పొర కనిపిస్తోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్లాసులో పోసిన నీటిపై స్పష్టంగా ఆయిల్ మాదిరిగా తేలుతున్న పొరను చూపిస్తూ, “ఇది తాగునీళ్లా... లేక విషమా? అంటూ మహిళలు, వృద్ధులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి నీటిని తాగాల్సి రావడంతో చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రామస్థుల కథనం ప్రకారం గత 20 రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. తాగునీటి ట్యాంకు, పైపులైన్ లేదా ఇతర సాంకేతిక లోపాల వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందా అనే కోణంలో అధికారులు వెంటనే దర్యాప్తు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. కలుషిత నీటి వల్ల అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తాగునీటి నమూనాలను వెంటనే సేకరించి ప్రయోగశాల పరీక్షలు నిర్వహించాలి. కలుషితానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రత్యామ్నాయంగా స్వచ్ఛమైన తాగునీటిని అత్యవసరంగా సరఫరా చేయాలి. బాధ్యులపై విచారణ జరిపి ప్రజలకు నివేదిక వెల్లడించాలి. ప్రజల ప్రాణాలకు సంబంధించిన ఈ అత్యంత కీలక అంశంపై అధికారులు తక్షణమే స్పందించి, గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మైదుకూరు సమీపంలో ఘోర ప్రమాదం

## కేసీ కెనాల్‌లో ట్రాక్టర్ పడి
## జార్ఖండ్ వలస కార్మికుడు మృతి



**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 11)**
మైదుకూరు మండలం శివపురం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ విషాదకర ప్రమాదం చోటుచేసుకుంది. కేసీ కెనాల్‌లో ట్రాక్టర్ పడిపోయిన ఘటనలో ఓ వలస కార్మికుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం మేరకు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన గోపి అనే వ్యక్తి మైదుకూరు పరిసర ప్రాంతాల్లో ఎలక్ట్రికల్



పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున సుమారు ఒంటిగంట ప్రాంతంలో అతను ట్రాక్టర్ పై శివపురం ఎస్సీ కాలనీలోని గంగమ్మ గుడి సమీపంగా వెళ్తున్నాడు. అయితే, చీకటిగా ఉండటంతో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న కేసీ (కర్నూలు-కడప) కెనాల్‌లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కింద పడిపోవడంతో తీవ్ర గాయాలనపాలైన గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మైదుకూరు పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రాథమిక సమాచారం మేరకు ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగానే భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు మైదుకూరు ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల పూర్తి వివరాల పై దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



# ప్రజా వైద్యశాల ఆస్పత్రి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మంత్రిని కలిసిన యాదవ జేఏసీ నేతలు

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 11)**

ఈ నెల 4న మండలకేంద్రంలోని ప్రజా వైద్యశాల ఆస్పత్రిలో వైద్యం వికటించి బక్కమంతుల పెద్ద బ్రహ్మయ్య అను యాదవ యువకుడు మృతి చెందాడని, కేవలం ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా నే అతను ప్రాణాలు కోల్పోయాడని కావున అతని మృతి పై సమగ్ర విచారణ చేయించి ఆసుపత్రి యాజమాన్యం పై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిందిగా యాదవ జేఏసీ జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపికృష్ణయాదవ్, వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు టి నాయుడుపాలెం గ్రామంలోని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి క్యాంప్ కార్యాలయం నందు కలిసి సమస్యను వివరించి న్యాయం చేయాలని వినతి పత్రం సమర్పించారు. మంత్రి వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్‌కి ఈ విషయం పై విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.





ప్రకాశం మార్కాపురం బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

12.07.26 ఆదివారం




# ఎస్సీ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 11)**

మార్కాపురం పట్టణంలోని ఎస్సీ హాస్టల్ వార్డెన్ బి మహాలక్ష్మిని సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. శనివారం ఆమె ఎమ్మెల్యే కందులు నారాయణరెడ్డితో కలిసి హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి వసతులు, విద్యార్థులకు అందిస్తున్న మెను, తాగునీటి వసతి వంటి సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దీని పై విద్యార్థినిలు స్పందిస్తూ మెను సక్రమంగా అందించడం లేదని, దాంతో పాటు త్రాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్వయంగా అక్కడి పరిస్థితులను పరిశీలించిన వారు వార్డెన్ సరైన పద్ధతిలో పనిచేయడం లేదని తేలడంతో జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత వార్డెన్‌ను సస్పెండ్ చేశారు (తరువాయి 4లో...)

# మార్కాపురం జిల్లా కలెక్టరేట్‌కు నూతన కంప్యూటర్ల అందజేత




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 11)**

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒంగోలు రీజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో మార్కాపురం కలెక్టరేట్‌కు 7 నూతన కంప్యూటర్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో వాటిని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం వి రవికుమార్, ఎల్‌డిఎం షాహీర్, మార్కాపురం మెయిన్ బ్రాంచ్ మేనేజర్ ప్రతాపరెడ్డి, తదితరులు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులుకు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బందిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. అదే విధంగా కలెక్టరేట్‌లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు వారు ముందుకు రావడం విశేషం. దీన్ని వచ్చేవారం ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

# ఒంగోలు వైసీపీలో ముదురుతున్న వివాదాలు

చిలికి చిలికి గాలి వానగా మారుతున్న వైయస్సార్ జయంతి నాటి ఘటన

జూలై 8 నాటి ఘటన పై పోలీసులకు ఫిర్యాదు చేసిన వైసీపీ ఎస్టీ నాయకురాలు ప్రసన్న

అదే రోజు మేరీ భర్త పై దాడి చేసిన ప్రసన్న కుటుంబ సభ్యులు

పార్టీ నాయకుల తీరు పై ఆవేదన వ్యక్తం చేస్తూ సెల్ఫ్ వీడియోతో ప్రసన్న ఆత్మహత్యాయత్నం

ఇది మా పార్టీలోని అంతర్గత విషయాలు, మేమే సర్దుకుంటాం అంటున్న ఒంగోలు వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చుండూరి



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 11)**

ఒంగోలు వైసీపీలో అంతర్గత వివాదాలు నేడు రోడ్డున పడుతున్నాయి. అవి చిలికి చిలికి గాలి వానగా మారి ఆత్మహత్యలు, దాడులు, ప్రతి దాడుల స్థాయికి చేరుకున్నాయి. ఈ నెల 8వ తేదీన వైయస్సార్ జయంతి సందర్భంగా ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కటింగ్ సందర్భంగా చోటుచేసుకున్న వివాదం ఎంతో కాలంగా పార్టీ మహిళా నాయకురాళ్ళలో నిగూఢంగా ఇప్పటివరకు దాగి ఉన్న అసంతృప్తి జ్వాలలు బయటపడుతున్నాయి. ఎస్టి కులానికి చెందిన వైసీపీ ఒంగోలు నియోజకవర్గ మహిళా నాయకురాలు పేరం ప్రసన్న తనను హిల్ చెప్పులతో మేరీ అనే కార్యకర్త తొక్కిందని ఆరోపించటం, ఆ నెపంతో మేరీ భర్త శివకుమార్ జిల్లా నాయ కత్వం ఎదుటనే ప్రసన్న పై దాడి చేయడం జూన్ 8న చోటుచేసుకున్న వివాదం. అయితే అదే రోజున ప్రసన్న మేరీ, ఆమె భర్త శివకుమార్ పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే అప్పుడే సర్ది చెప్పవలసిన జిల్లా నాయకత్వం లోపం కారణంగా ఆ వివాదం మరింత ముదిరి పాకాన పడింది. అదే రోజు రాత్రి ఒంగోలు, కర్నూలు రోడ్డులోని ఒక హోటలలో పనిచేస్తున్న మేరీ భర్త శివ కుమార్ పై ప్రసన్న బంధువులు దాడి చేశారు. దీంతో శివకుమార్ చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేరారు. ఇది ఇలా ఉండగా వైసీపీ పార్టీ గ్రూపులలో తన వీడియోలను ఎందుకు డిలేట్ చేశారంటూ, తనను ఎందుకు తొలగించారంటూ, ఒక మగ వ్యక్తి వచ్చి తన పై దాడి (తరువాయి 4లో...)

# ఏ తల్లి కన్న పసిబిడ్డో..!

ఊరు చివర రాత్రి సమయంలో జొన్న చేలో విసిరివేయబడిన శిశువు

అమ్మతనాన్ని అని మర్చిపోయి కర్కశంగా వ్యవహరించిన తల్లి






**(షణ్ముఖ వెలుగు, దర్శి, జూలై 11)**

ఏ తల్లి కన్న పసిబిడ్డ ఊరు చివర ఈ రాత్రి సమయంలో జొన్న చేలు విసిరేబడ్డ పసి శిశువు దయానియా పరిస్థితి వివరలోకి వెళితే ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం గ్రామ శివారులో అద్దంకి వెళ్లే మార్గంలోని జొన్న చేలో ఆడపిల్ల పుట్టింది అనే భారమైందో?, అక్రమ సంతానంగా పుట్టింది అనే? అనారోగ్య సమస్యలతో పుట్టింది అనే? కారణంతోనో, కారణలు ఏమైనా ఒక తల్లి మానవత్వాని అమ్మ తనాన్ని అని మర్చిపోయి కర్కస్యంగా ఒక ఆరు రోజుల బ్రతికి ఉన్న ఆడ శిశువును జొన్న చేలో పాపను పారవేయడం జరిగింది. ఆ పసిపాప లేత శరీరంపై వీచే గాలుల ద్వారా జొన్న చేను ఆకులు శరీరంపై రాపిడి జరగడం ద్వారా రక్త స్రావం కావటం అవటం దాహం కలగటం బిగ్గరగా ఏడుస్తున్న తన ఆవేదనను అర్థం చేసుకునే వాళ్ళు ఎవరు లేక రాత్రి అంత ఆ జొన్న చేలో పసి హృదయం ఆవేదనలతో ఆక్రందనతో అల్లాడుతూ ఉండిపోయింది. తెల్లవారుజామునగ్రామంలోని కొంతమంది వ్యక్తులు ఊరు బయట బహిర్భూమికి వెల్లిన వాళ్లకి జనసేన పసిపాప యొక్క ఏడుపులు వినిపించడంతో వెంటనే వారు ముండ్లమూరు ఎస్సై ఎం కోటేశ్వరరావు కు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ కు ప్రకాశం జిల్లా బాలల సంరక్షణ అధికారి పి దినేష్ కుమార్ కు సమాచారం అందించడంతో వెంటనే స్పందించి వెంటనే ఈ విషయాన్ని జిల్లా మహిళా శిక్షణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ. పద్మ సునంద ఆదేశాల మేరకు పసిపాపను ముండ్లమూరు అంగన్వాడి సూపర్వైజర్ బి ఇంద్ర అంగన్వాడీ కార్యకర్త కల్పన హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఔట్రిచ్ వర్కర్లు టి దుర్గ భవాని, వి మల్లేశ్వరి సంఘటన స్థలానికి చేరుకుని వెంటనే పాపను సంరక్షణకు తీసుకుని స్థానిక అంబులెన్స్ లో ప్రధమ వైద్య చికిత్స నిమిత్తం అద్దంకి కమిటీ హెల్ప్ సెంటర్ కు తీసుకురావడం జరిగింది. స్థానిక డాక్టర్లు పాప యొక్క ఆరోగ్య స్థితిని పర్యవేక్షించి మెరుగైన వైద్య సేవ నిమిత్తం ఒంగోలు రిమ్స్ హాస్పటల్ కు తరలించడం జరిగింది. స్థానిక ఒంగోలు రిమ్స్ హాస్పటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి లత రిమ్స్ పిల్ల వైద్య నిపుణులు డాక్టర్ తిరుపతి రెడ్డి పర్యవేక్షించి పాప యొక్క ఆరోగ్య స్థితి నిలకడగా ఉందని శరీరం జొన్న చేలోనే ఆకులు రాపిడి ద్వారా మొఖంపై చేతులపై కొంత గాయాలు కావటం జరిగిందని, పూర్తి వైద్య పరీక్షలు చేసి పాపకు మెరుగైన వైద్య సేవలు అందించి పాపకు ఎటువంటి ప్రాణహాని లేకుండా పూర్తి వైద్య సేవలు అందిస్తామని తెలియజేశారు. పాప పూర్తిగా ఆరోగ్యం (తరువాయి 4లో...)

# ఆంధ్రప్రదేశ్ ప్రసూతి, స్త్రీ వైద్య శాస్త్ర సొసైటీ ఆధ్వర్యంలో ఒంగోలులో రాష్ట్రస్థాయి సదస్సు

సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 11)**




ఆంధ్రప్రదేశ్ ప్రసూతి, స్త్రీ వైద్య శాస్త్ర సొసైటీ ఆధ్వర్యంలో ఉమెన్స్ హెల్త్ నేషన్స్ ప్రైడ్ అనే నినాదంతో ఒంగోలులో 3 రోజుల రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కీనోట్ ఉపన్యాసాలు, సైంటిఫిక్ పేపర్ ప్రజెంటేషన్లు, ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లు నిర్వహించారు. రెండవ రోజు శనివారం ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, బి ఎన్ విజయ్ కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ స్త్రీల ఆరోగ్యం పై దృష్టి సారించే కీలకమైన రంగాలు గైనకాలజీ, ప్రసూతి శాస్త్రం, పునరుత్పత్తి ఆరోగ్యం. ఈ సదస్సు స్త్రీల పునరుత్పత్తి ఆరోగ్యం, గర్భధారణ ఫలితాలు, మొత్తం శ్రేయస్సును మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్న అద్భుతమైన పరిశోధనలు, అభివృద్ధి చెందుతున్న పద్ధతులు, వినూత్న పరిష్కారాలను అన్వేషిస్తుందన్నారు. శాస్త్రీయ పురోగతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం ద్వారా సంరక్షణను మెరుగుపరచడం పై దృష్టి సారించడం అభినందననీయమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మహిళల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని తెలిపారు. గర్భిణీ, బాలింత మహిళలకు అంగన్వాడి కేంద్రాలతో పౌష్టిక అందించడంతో .పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని మంత్రి స్వామి తెలిపారు

# లీడ్ బ్యాంక్ కార్యాలయం ప్రారంభం





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 11)
మార్కాపురం శ్రీనివాస థియేటర్ సమీపంలో యూనియన్ బ్యాంకు వద్ద లీడ్ బ్యాంకు కార్యాలయాన్ని శనివారం యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ రవికుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా లీడ్ బ్యాంకు ఎల్‌డిఎం షాహీర్, ఏఎల్ డిఎం పులుకూరి సునీల్ బాబు, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ యూనియన్ ప్రెసిడెంట్ గండి దయాకర్, మార్కాపురం యూనియన్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ బ్రాంచ్ మేనేజర్ శివకుమార్, ఇతర బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆది ఆంధ్ర కాలనీలో ప్రపంచ జనాభా దినోత్సవం






(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూలై 11)
మండలంలోని కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఉలవపాడు, ఆత్మకూరు ఆది ఆంధ్ర కాలనీ నందు శనివారం డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ శ్రీజరెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ప్రస్తుతం విపరీతంగా పెరుగుతున్న జనాభా గురించి అందువల్ల ఏర్పడుతున్న దుష్పరిణామాల గురించి చర్చించుకోవలసిన అవసరాన్ని గుర్తు చేస్తూ అందుకు పరిష్కార మార్గాలపై ప్రతి ఒక్కరు దృష్టి సాధించాలనే విషయాలను చాటి చెప్పేందుకు నేడు ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ముఖ్యంగా స్త్రీలకు 21 సంవత్సరాలు, పురుషులకు 25 సంవత్సరాలు సరైన వివాహ వయస్సుగా తల్లిదండ్రులు గుర్తించాలని దీని వలన శారీరక పెరుగుదల మానసిక ఎదుగుదల జరుగుతుందని తద్వారా శిశువులు ఆరోగ్యవంతంగా తల్లి ఆరోగ్యంగా ఉండడానికి వీలవుతుందని ప్రజలకు వివరించడం జరిగింది . అదేవిధంగా బిడ్డకు బిడ్డకు మధ్య కనీసం మూడు సంవత్సరాలు వ్యవధి అవసరమని దీని కై ప్రభుత్వం వారు నోటి మాత్రలు, కాపర్టీ, ఛాయా పిల్స్ ఇటువంటి గర్భ, నిరోధకాలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంటాయని అలాగే ప్రసవానంతరము తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పౌష్టికాహారం గురించి వ్యాధి నిరోధక టీకాల గురించి వివరిస్తూ పిల్లల మధ్య ఎడం పెడదాం ఆరోగ్యకరమైన జీవితాన్ని అనుభవిద్దాం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఒంగోలు వైసీపీలో ముదురుతున్న వివాదాలు



చేస్తుంటే జిల్లా నాయకత్వం, ఒంగోలు నియోజకవర్గ నాయకత్వం ఎందుకు చూస్తూ ఊరుకున్నారని, గత సంవత్సరం కాలంగా తన పై పార్టీలో వేధింపులు పెరిగాయని, పార్టీని తన నుండి దూరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రసన్న శుక్రవారం రాత్రి సెల్ఫ్ వీడియోలో పలు మాత్రలు మింగుతూ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్లు వీడియో బహిర్గతమైనది. అయితే వెంటనే స్పందించిన ప్రసన్న కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం నిమిత్తం ప్రసన్నను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కిమ్స్ హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళమని చెప్పడంతో కిమ్స్ హాస్పిటల్ కీ తరలించారు.



**మేమే పరిష్కరించుకుంటాం...**

జులై 8న జరిగిన ఘటన చాలా దురదృష్టకరమని వైసిపి ఒంగోలు నియోజకవర్గ ఇంచార్జ్ చుండూరి రవిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అది తమ పార్టీ అంతర్గత విషయమని, ఇరు వర్గాలను కూర్చోబెట్టి సర్ది చెప్తామన్నారు. ఈ పాటికే జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఈ ఘటన పై మాజీ రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున, వైసీపీ ఒంగోలు నియోజకవర్గ పరిశీలకులు వై వెంకటేశ్వరరావు, దొనకొండ ఎంపీపీ ఉష మురళితో త్రిసభ్య కమిటీని కూడా ఏర్పాటు చేశారని, వారం రోజులలో కమిటీ నివేదిక ఇస్తుందని, నివేదిక ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో వసతులు మెరుగుపరచటమే ప్రభుత్వ లక్ష్యం

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 11)
మార్కాపురం జిల్లాకలెక్టర్ ఎం విజయసునీత మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి పట్టణంలోని కలెక్టర్ బంగ్లా ఎదుట ఉన్న ఎస్సీ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్వయంగా బాలికలతో మాట్లాడారు. అనంతరం వసతి గృహంలోని వంటశాలను, ఆర్డీ ప్లాంట్ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనం పెట్టట్లేదని, కనీసం త్రాగునీరు కూడా తమకు సరిగా సరఫరా చేయడం లేదని బాలికలు తమ దృష్టికి తెచ్చారని దీనిపై సమీక్ష చేసి బాధ్యులైన వారిపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టల్లో వసతులు మెరుగుపరచటమే ప్రభుత్వ ఉద్దేశం అని తెలిపారు.





# ఎరువుల పంపిణీలో పారదర్శకత

**అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్న ఏపిఏఐఎంఎస్ 2.0**
**కడప జిల్లాలో పుష్కలంగా యూరియా, డీఏపీ నిల్వలు**
**నిబంధనలు ఉల్లంఘిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు**
**నిరంతర తనిఖీలు**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వెల్లడి**

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 11)



రైతాంగానికి మేలు చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన సాంకేతిక విధానం ఏపిఏఐఎంఎస్ 2.0 ద్వారా జిల్లాలో ఎరువుల పంపిణీ అత్యంత పారదర్శకంగా, అవినీతి రహితంగా సాగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత ఎక్కడా లేదని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. జూన్ 8 నుంచి జిల్లావ్యాప్తంగా ఉన్న 274 ప్రైవేట్ కేంద్రాలు, 11 డీసీఎంఎస్, 8 పీఏసీఎస్, 393 రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులను నిరంతరాయంగా సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**రికార్డు స్థాయిలో పంపిణీ.. లబ్ధి పొందిన 32 వేల మంది రైతులు**

జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ఎరువుల పంపిణీ, ప్రస్తుతం గిడ్డంగుల్లో సిద్ధంగా ఉన్న నిల్వల వివరాలను కలెక్టర్ గణాంకాలతో సహా వెల్లడించారు. యూరియా 1,26,614 సంచులు (5,697.72 మెట్రిక్ టన్నులు), డీఏపీ 17,134 సంచులు (771.09 మెట్రిక్ టన్నులు). ఇప్పటివరకు జిల్లాలో 32,959 మంది రైతులు ఎరువులు పొందగా, అందులో 16,036 మంది రైతు సేవా కేంద్రాల ద్వారానే లబ్ధి పొందారు. ప్రస్తుతం జిల్లాలోని మార్క్‌ఫెడ్ గిడ్డంగులు, ప్రైవేట్ డీలర్ల వద్ద ఇంకా 13,884 మెట్రిక్ టన్నుల యూరియా, 3,491 మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి.

**బ్లాక్ మార్కెటింగ్‌కు చెక్.. కౌలు రైతులకూ రక్షణ**

ఏపిఏఐఎంఎస్ 2.0 విధానం వల్ల రైతుల భూమి, పంట వివరాల ఆధారంగానే డిజిటల్ పద్ధతిలో ఎరువుల పంపిణీ జరుగుతుందని, దీనివల్ల అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడిందని కలెక్టర్ వివరించారు. స్మార్ట్‌ఫోన్ లేని రైతులకు బయోమెట్రిక్ ద్వారా అందిస్తున్నామన్నారు. అలాగే వెబ్‌ల్యాండ్‌లో వివరాలు లేని కౌలు రైతులు, ఇనాం, దేవాదాయ భూముల రైతులకు కూడా ప్రత్యేక విధానంలో ఎరువులు ఇస్తున్నామని, ఇప్పటికే ఈ పద్ధతిలో 815 ఎకరాలకు యూరియా పంపిణీ చేశామని తెలిపారు.

**తనిఖీలు ముమ్మరం : ఇద్దరు డీలర్లపై వేటు**

ఎరువుల అమ్మకాల్లో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో వ్యవసాయ శాఖ ప్రత్యేక బృందాలు ఇప్పటివరకు 242 ఎరువుల దుకాణాలను తనిఖీ చేశాయని, నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు డీలర్ల లైసెన్సులు సస్పెండ్ చేసి, మరో ఎనిమిది మందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఈ నూతన విధానంపై రైతులకు మరింత అవగాహన కల్పిస్తామన్నారు.

**అధిక ధరలకు అమ్మితే ఫిర్యాదు చేయండి**
**టోల్ ఫ్రీ నంబర్ 8500277776**

ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు అమ్మినా, ఎరువులతో పాటు ఇతర వస్తువులను బలవంతంగా అంటగట్టినా రైతులు తక్షణమే వ్యవసాయ అధికారులకు లేదా 8500277776 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ కోరారు. రైతులకు సకాలంలో ఎరువులు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని ఆయన భరోసా ఇచ్చారు.

# ఎస్సీ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్



# ఏ తల్లి కన్న పసిబిడ్డో..!

కోరుకున్న తర్వాత పాపను ఒంగోలు రాంనగర్ లోని మాతా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడేటటువంటి శిశు గృహాలు చేర్పించడం జరుగుతుందన్నారు. శిశు గృహాలు చేర్పించడం జరుగుతుందని పోలీసు వారి యొక్క పాపను ఎవరు పారేశారు అనేది తెలుస్తుందన్నారు. వారిపట్ల చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎవరైనా బిడ్డలను పెంచలేమని గాని భారం అనుకున్న ఆడపిల్ల పుట్టిందని వివక్షత ఉన్న అనారోగ్యంతో పుట్టారని ఒక అపోలో ఉన్న ఎవరు మీ బిడ్డల్ని కర్కసంగా మానవత్వం మర్చిపోయి పసిబిడ్డలను ముళ్ళ పొదలో లేదా ఆ బిడ్డలకు ఎటువంటి ప్రాణాన్ని కలిగించకుండా జిల్లా మహిళా, సంక్షేమ శాఖ అధికారులు కానీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గాని, జిల్లా బాలల సంరక్షణ అధికారులు గానీ సమాచారం ఇచ్చినట్లయితే వారిని మా సంరక్షణలోకి తీసుకుని వారికి రక్షణ సంరక్షణ కలిగించడం జరుగుతుందన్నారు. ఎవరు ఆ పసి హృదయాన్ని పార వేయవద్దు, చంపవద్దని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఏ పద్మ సునంద పేర్కొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి

## కడప టూటౌన్ సీఐ శ్రీహరి







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 11)
సమాజంలో యువత జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల మహమ్మారిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ తమవంతు పాత్ర పోషించాలని కడప టూటౌన్ సీఐ శ్రీహరి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యానాది కాలనీలో 'ఈగల్ సెల్' ఆధ్వర్యంలో "డ్రగ్స్ వద్దు బ్రో" అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీహరి మాట్లాడుతూ మత్తు పదార్థాల అలవాటు వల్ల బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గంజాయి నివారణలో ప్రతి తల్లి ఒక 'బ్రాండ్ అంబాసిడర్' లా మారి, తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ వారిని వ్యసనాలకు దూరంగా ఉంచాలని సూచించారు. వ్యసనాలకు దూరంగా ఉంచాలని సూచించారు.

**వివరాలు గోప్యంగా ఉంచబడును**
**టోల్ ఫ్రీ నెంబర్ 1972**

మీ పరిసర ప్రాంతాలలో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నా, వాడుతున్నా ప్రజలు వెంటనే 1972 అనే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు. పోలీసుల పిలుపునకు స్పందించిన స్థానిక ప్రజలు, మత్తు పదార్థాల నివారణలో తాము కూడా భాగస్వామ్యులవుతామని ఉత్సాహంతో ప్రతిజ్ఞ చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో టూటౌన్ ఎస్ఐలు రామకృష్ణ, రఫీ, పోలీస్ సిబ్బందితో పాటు ఈగల్ సెల్ సిబ్బంది అయూబ్ ఖాన్, గురు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# పుట్టా పోలమ్మకు పార్థివదేహానికి ప్రముఖుల ఘన నివాళి

## సొంత వ్యవసాయ క్షేత్రంలో ముగిసిన అంత్యక్రియలు









**(షణ్ముఖ వెలుగు, ప్రొద్దుటూరు, జులై 11)**

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాతృమూర్తి పుట్టా పోలమ్మ పార్థివదేహానికి శనివారం పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ పార్టీల ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. ప్రొద్దుటూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఉంచిన పోలమ్మ పార్థివదేహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో తలసాని శ్రీనివాస్ యాదవ్ (మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే), మాధవిరెడ్డి (కడప ఎమ్మెల్యే), వరదరాజులరెడ్డి (ప్రొద్దుటూరు ఎమ్మెల్యే), శ్రీనివాస్‌రెడ్డి (టీడీపీ జోనల్ కోఆర్డినేటర్), పుత్తా నరసింహారెడ్డి (కమలాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి), భూపేష్‌రెడ్డి (కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు), సి ఎం సురేష్ నాయుడు (రాష్ట్ర టీడీపీ నాయకులు), లింగారెడ్డి (టీడీపీ సీనియర్ నాయకులు), విజయజ్యోతి (కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు) ఉన్నారు. నివాళులర్పించిన అనంతరం ప్రముఖులందరూ మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పుట్టా పోలమ్మ ఆత్మకు సద్గతులు కలగాలని ఆకాంక్షించారు.

**వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు :**

ప్రొద్దుటూరు స్థానిక మడూరులోని ఎమ్మెల్యే సొంత వ్యవసాయ క్షేత్రంలో పుట్టా పోలమ్మ అంత్యక్రియలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ అంతిమ యాత్రలో కుటుంబ సభ్యులతో పాటు భారీ సంఖ్యలో రాజకీయ నాయకులు, అభిమానులు, నియోజకవర్గ ప్రజలు పాల్గొని ఆమెకు కన్నీటి వీడ్కోలు పలికారు.





# కీర్తన గోల్డ్ లోన్ బ్రాంచ్‌ను ప్రారంభించిన ఆదినారాయణ, గోపీచంద్





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 11)**

ఒంగోలులోని రామ్ నగర్ 1ర్ లైన్ లో కీర్తన గోల్డ్ లోన్ బ్రాంచ్3 ను 15వ డివిజన్ అధ్యక్షులు గడ్డం ఆదినారాయణ, మాజీ కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్ ప్రారం భించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ కీర్తన గోల్డ్ లోన్ లు అతి తక్కువ వడ్డీకి ఇచ్చి ప్రజలు మన్ననలు పొందాలని కోరారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించి ముఖ్యఅతిథిలకు సన్మానం నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ నగరంలో 2 బ్రాంచ్ లు ఏర్పాటు చేశామని, శనివారం మూడోవ బ్రాంచ్ ఏర్పాటు చేశామని ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మధుమంచి శ్రీను, బొమ్మిశెట్టి కోటేశ్వరరావు (క్లస్టర్ మేనేజర్), చల్ల హరి నారాయణ (బి.సి.వై) పార్టీ డిస్టిక్ ప్రెసిడెంట్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ అచ్చమాంబ పేరంటాల అమ్మ వారి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్ర



**(షణ్ముఖ వెలుగు, పామూరు, జూలై 11)**

మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలోలి నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ అచ్చమాంబ పేరంటాల అమ్మ దేవస్థానం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యరు. ఈ సందర్భంగా అచ్చమాంబ పేరంటాల అమ్మ వారి కళ్యాణ మహోత్సవానికి భక్తిశ్రద్ధలతో పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులతో ఆప్యాయంగా మమేకమై, అమ్మవారి కృపాకటాక్షాలతో నియోజకవర్గంలోని ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.

# టిడిపి నాయకులను పరామర్శించిన ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్‌రావు, ఉగ్ర నరసింహారెడ్డి





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూలై 11)**

ఒంగోలు నగరంలోని ఆరోగ్యం బాగాలేక కిమ్స్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న టిడిపి పార్టీ నాయకులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, పసుమర్తి శ్యామ్‌ని ఒంగోలు, కనిగిరి ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్‌రావు, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిలు పరామర్శించి ఆరోగ్య పరిస్థితి పై కిమ్స్ హాస్పటల్ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఆయనతో పాటు కిమ్స్ అంకిరెడ్డి, తదితరులు ఉన్నారు.

# ఎస్సీ విద్యార్థులకు 3 ఎక్సలెన్సి సెంటర్లు, 10శాతం మెస్ ఛార్జీల పెంపు హర్షనీయం

## ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమార్



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జులై 11)**

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మూడు ఎక్సలెన్సీ సెంటర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ ఆమోదించటము యావత్ ఎస్సీ విద్యార్థులు, వారి కుటుంబాలు హర్షిస్తున్నారని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీటిలో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా నాణ్యమైన విద్యను, నైపుణ్యత కలిగిన టీచర్లు చేత బోధనను అందించడంతో పాటు మంచి పోషకాలు కలిగిన ఆహారాన్ని అందిస్తారని చెప్పారు. ఈ సంవత్సరం నుండే వీటిని విశాఖ జిల్లా మధురవాడలో, గుంటూరు జిల్లా తాడికొండలో, తిరుపతి జిల్లా కోటాలో ప్రారంభిస్తారని, వీటిలో ఇంటర్‌తో పాటు ఐఐటి, జెఈఈ, నీట్‌కి ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. బాల, బాలికలకు వేరువేరుగా తరగతులు నిర్వహిస్తూ ప్రవేశాలలో 50% బాలికలకు రిజర్వేషన్ కల్పిస్తారన్నారు. ముఖ్యంగా సాంఘిక సంక్షేమ హాస్టల్‌లలో, అంబేద్కర్ గురుకులాల్లో మెస్ చార్జీలు 10% శాతం పెంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గొప్ప మనసు చాటుకున్నారని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్ అన్నారు.

# పేదలపాలిట పెన్నిధి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## యువ నాయకుడు కందుల విగ్నేష్‌రెడ్డి



**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జులై 11)**

రాష్ట్ర వ్యాప్తంగా పేద, బలహీన వర్గాలకు చెందిన వారు వివిధ రకాల జబ్బులతో బాధపడుతు వారికి సరైన వైద్యం చూపించుకునేందుకు వారి దగ్గర ఆర్థిక స్తోమత లేక కొందరు కొందరుపేదలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ తరుణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేదలపాలిట పెన్నిధిగా మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రులలో ఖర్చు పెట్టిన మొత్తంలో ఎంతో కొంత ఊరట కలిగించే విధంగా వారికి ఆర్థిక సహాయం చేసి వారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారని మార్కాపురం నియోజకవర్గ టిడిపి యువనాయకుడు కందుల విగ్నేష్‌రెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగా తర్లుపాడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పది మంది లబ్ధిదారులకు సుమారు రూ. 4,75,599ల చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. అందులో మేకలవారిపల్లి గ్రామానికి చెందిన భీమనబోయిన యానదయ్యకు రూ. 99,809, మేకలవారిపల్లి గ్రామానికి చెందిన లింగాల మల్లమ్మకు రూ. 78,292, నాగేండ్ల ముడుపు గ్రామానికి చెందిన కాకర్ల వెంకట నాగేంద్రంకు రూ. 43,184, నాగేండ్లముడుపు గ్రామానికి చెందిన కొమ్మ శివకుమార్ రూ. 40,000, పోతలపాడు గ్రామానికి చెందిన రాచకొండ రాములుకు రూ. 41,500, రోలుగుంపాడు గ్రామానికి చెందిన కొండెబోయిన సుబ్బలక్ష్మమ్మకు రూ. 23,920, తర్లుపాడు గ్రామానికి చెందిన చేతుల వెంకటలక్ష్మమ్మ రూ. 35,000, తర్లుపాడు గ్రామానికి చెందిన షేక్ ఖాసింపీరాకు రూ. 37,810, తర్లుపాడు గ్రామానికి చెందిన పల్లెపోగు ప్రవీణ్‌కు రూ. 35,000, తుమ్మలచెరువు గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ నాసర్‌కు రూ. 41,084, చెక్కులను కందుల విగ్నేష్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. దీంతో ఆయా కుటుంబాలలోని సభ్యులు ఆయనకు అభినందనలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ మండల నాయకులు, గ్రామపార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







# ఎస్ఐ సూరెడ్డి రాజేష్ గణన చైతన్యం

**పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ఎన్యుమరేషన్ ఆడియో ప్రసారం**
**రద్దీ కూడలిలో ప్రయాణికులకు, వ్యాపారులకు అవగాహన**



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 11)**
జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే ఎన్యుమరేషన్ ప్రక్రియపై పోలీస్ అధికారులు సరికొత్తగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నిత్యం వేలాది మంది ప్రజలు, జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాల మేరకు, సిఐ రాజేష్ కుమార్ సూచనలతో ఎస్ఐ సూరెడ్డి రాజేష్ ప్రయాణికులతో రద్దీగా ఉండే నగరంలోని ప్రధాన కూడలి పెద్ద బస్టాండ్ సెంటర్ వేదికగా శనివారం ఒక వినూత్న అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మైక్ సిస్టమ్ ద్వారా ఎన్యుమరేషన్‌కు సంబంధించిన అధికారిక సమాచార ఆడియోను విస్తృతంగా ప్రసారం చేశారు. ఈ ఆడియో రికార్డింగ్ ద్వారా ఎన్యుమరేషన్ యొక్క ముఖ్య ఉద్దేశాలు, ప్రజలు సర్వే సిబ్బందికి అందించాల్సిన వివరాలు, ఈ గణన వల్ల చేకూరే ప్రయోజనాలను క్షుణ్ణంగా వివరించారు. ఎటువంటి గందరగోళం లేకుండా, ప్రతి ఒక్కరికీ ఈ ప్రక్రియపై పూర్తి స్పష్టత వచ్చేలా సరళమైన భాషలో ఈ మైక్ అనౌన్స్‌మెంట్ సాగింది.ఎన్యుమరేషన్ సిబ్బంది మీ ఇంటికి వచ్చినప్పుడు ప్రజలంతా పూర్తి వివరాలతో, పారదర్శకంగా సహకరించాలని,ప్రభుత్వ పథకాలు, ప్రణాళికల రూపకల్పనకు ఈ సమాచారం ఎంతో కీలకమని ఎస్సై తెలిపారు. సాధారణంగా కరపత్రాలు, గోడ పత్రికల కంటే ఇలా మైకుల ద్వారా నిరంతరం అనౌన్స్ చేయడం వల్ల ప్రయాణికులకు, స్థానిక వ్యాపారులకు మరియు సాధారణ ప్రజలకు సులువుగా రీచ్ అయిందని అధికారులు భావిస్తున్నారు. బస్టాండ్ సెంటర్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు సైతం ఈ ఆడియోను శ్రద్ధగా వినడం కనిపించిందనీ, రానున్న రోజుల్లో నగరంలోని మిగిలిన ప్రధాన కూడళ్లలో కూడా ఈ తరహా మైక్ ప్రచారాన్ని కొనసాగిస్తామని ఎస్ఐ రాజేష్ తెలిపారు.

# జీజీహెచ్‌ని తనిఖీ చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే







**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 11)**
మార్కాపురం సమీపంలోని గుండ్లకమ్మ నది ఒడ్డున ఉన్న గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ప్రతి వార్డును పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై డాక్టర్ల ను అడిగి తెలుసుకున్నారు. రోగులను ఆప్యాయంగా పలకరించి వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అదేవిధంగా అక్కడి డయాలసిస్ సేవలు, థైరాయిడ్ మిషన్ వంటి వాటి గురించి ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న మెనూ, మందుల స్టాక్ రూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట నాయకులు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# వియత్నాం పడవ ప్రమాదంలో కడపవాసి దుర్మరణం

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 11)**
ఉపాధి, వ్యాపార నిమిత్తం విదేశాలకు వెళ్లిన కడప నగరానికి చెందిన ముడియం శ్రీధర్ వియత్నాంలో జరిగిన ఘోర పడవ ప్రమాదంలో అకాల మరణం చెందారు. వియత్నాంలో పర్యాటక ప్రాంతంలో ప్రయాణిస్తుండగా జరిగిన ఈ ప్రమాదంలో శ్రీధర్ మృతి చెందినట్లు శనివారం ఇక్కడి అధికారులకు సమాచారం అందింది. శ్రీధర్ మరణవార్త వినగానే కడపలోని ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

**బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆర్డీవో మురళి**
**కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు**
**మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించేందుకు ముమ్మర ఏర్పాట్లు**

**జిల్లా యంత్రాంగం దిగ్భ్రాంతి – కలెక్టర్ ఆదేశం**
ఀఈ ఘోర ప్రమాదంపై వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కడప ఆర్డీవో మురళి తక్షణమే స్పందించి, కడపలోని మృతుడి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీధర్ చిత్రపటానికి అంజలి ఘటించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

**మృతదేహాన్ని రప్పించేందుకు ముమ్మర ప్రయత్నాలు :**
ఈ సందర్భంగా ఆర్డీవో మురళి మాట్లాడుతూ శ్రీధర్ భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా స్వస్థలానికి తీసుకురావడానికి జిల్లా యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లను సమీక్షిస్తోందని తెలిపారు. వియత్నాంలో శ్రీధర్ వాణిజ్య భాగస్వామ్య కంపెనీ యాజమాన్య ప్రతినిధులతో అధికారులు నిరంతరం మాట్లాడుతున్నారు. మృతదేహాన్ని భారతదేశానికి తీసుకురావడానికి అవసరమైన దౌత్యపరమైన అనుమతులు, విదేశీ వ్యవహారాల శాఖతో సంప్రదింపుల ప్రక్రియను వేగవంతం చేయడానికి సమన్వయం చేస్తున్నారు.





**ప్రభుత్వం అండగా ఉంటుంది :**
తీవ్ర ఆవేదనలో ఉన్న బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని, పూర్తి న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఆర్డీవో మురళి భరోసా ఇచ్చారు. ఈ అంతర్జాతీయ ప్రమాదంపై తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులతో నిరంతరం టచ్‌లో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.





# పెద్దారవీడులో చోరీ రూ.5 లక్షల బంగారం మాయం

**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జులై 11)**
మండలంలోని ఎస్ కొత్తపల్లి గ్రామంలో దొంగలు రెచ్చిపోయారు. శుక్రవారం రాత్రి ఇమ్మడి వెంకటేశ్వర్లు ఇంటి వెనుక తలుపు పగులగొట్టి సుమారు రూ.5 లక్షల విలువైన బంగారు నగలను దుండగులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పెద్దారవీడు ఎస్ఐ సైదుబాబు ఘటన స్థలం చేరుకొని చివరికి గుర్తైన నివాసాన్ని పరిశీలించారు. శనివారం కేసు నమోదు చేశారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించి ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

# చెన్నకేశవ స్వామికి ఘనంగా ఉయ్యాల సేవ

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 11)**
మార్కాపురం జిల్లా కేంద్రంలో వెలసిన చెన్నకేశవ స్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా ఉయ్యాల సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ముందుగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు అనంతరం ప్రత్యేక అలంకరణలో ఉయ్యాల సేవ జరిపించారు, ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు.



# కూటమి ప్రభుత్వం చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తోంది

**క్రీడలు మానసిక ఆరోగ్యానికి, శారీరక ఉల్లాసానికి దోహదం చేస్తాయి**
**విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి**
**మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

**(షణ్ముఖ వెలుగు, కొండపి, జులై 11)**
కూటమి ప్రభుత్వం చదువుతో పాటు క్రీడలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ బాయ్స్, గర్ల్స్ టెన్ని-కాయిట్ ఛాంపియన్‌షిప్ పోటీలకు శనివారం ముఖ్య అతిథిగా మంత్రి డిఎస్ బీవీ స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తోంది. క్రీడలు మానసిక ఆరోగ్యానికి శారీరక ఉల్లాసానికి దోహదం చేస్తాయి. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తున్నాం. పాఠశాలల్లోనూ స్పోర్ట్స్ మీట్‌కు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం గల క్రీడాకారుల్ని వెలికి తీసి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మంత్రి స్వామి తెలిపారు. జరుగుమల్లి జడ్పీ పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థులను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు.










# 14న ప్రకాశం కలెక్టరేట్ ముట్టడి

## ఫ్యాప్టో పిలుపు

## కరపత్రాలను ఆవిష్కరించిన ఉపాధ్యాయ సంఘం నాయకులు



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జులై 11)**
ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చూపుతున్న ఉదాసీనతకు నిరసిస్తూ 14న నిర్వహించ తలపెట్టిన ఉమ్మడి ప్రకాశం జిల్లా కలెక్టరేట్ ముట్టడిని ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఫ్యాప్టో భాగస్వామ సంఘాల ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎంజో హోమ్ నందు సమావేశం ఏర్పాటు చేసి డిమాండ్లతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. 12వ వేతన సర్వ సంఘాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలి. 30% మభ్యంతరభృతిని ప్రకటించాలి. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 5 పెండింగ్ డిఏ లను ప్రకటించాలి. పెండింగ్లో ఉన్న అన్ని రకాల బకాయిలను చెల్లించాలి. కేజీబీవీ మోడల్ స్కూల్స్ గురుకులాలు ఎడిట్ యాజమాన్యాల సమస్యలను పరిష్కరించాలి. జీవో నెంబర్ 342 అనుసరించి ఎస్సీ ఎస్టీలకు అనవసర నిబంధనలు లేకుండా స్టడీ లీవ్ ను వినియోగించుకునే అవకాశం కల్పించాలి. 2025 బదిలీలలో బదిలీ పొంది రిలీవర్ లేని కారణంగా రిలీవ్ కానీ ఉపాధ్యాయులకు తక్షణమే రిలీవ్ చేయాలి. ఎంటిఎస్ ఉపాధ్యాయులకు పదవీ విరమణ 60 నుండి 62 సంవత్సరాలు పెంచాలి వారి సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలి ఇంకను మిగిలి ఉన్న 1998 క్వాలిఫైడ్ వారిని నియమించుటకు తగు చర్యలు చేపట్టాలి. ఈహెచ్ఎస్ మెడికల్ రీఎంబర్స్మెంట్ బిల్లుల విషయంలో నిత్యం ఉత్పన్నం అవుతున్న సమస్యలను పరిష్కరించాలి మెడికల్ రీయంబర్స్మెంట్ కాల పరిమితి జీఓ ను వెంటనే విడుదల చేయాలనే డిమాండ్లు ప్రభుత్వం ముందుంచనున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు మార్కాపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ దేశా నాయక్, ఎర్రగొండపాలెం మండల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆర్ ఏస నాయక్, మల్లికార్జున రెడ్డి, ఏ నాగయ్య, పి కృష్ణమూర్తి నాయక్, ఎస్టియు జిల్లా కార్యదర్శి ఆర్ మాలకొండ నాయక్, గౌరవ అధ్యక్షులు జే వెంకటేశ్వర్లు, ధనుంజ పార్థసారథి, రామ్మోహన్‌రావు, అబ్దుల్ కలాం, సతీష్ కుమార్, జి సీతారామాంజనేయులు, తదితర ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ పీజీ విద్యార్థులతో ప్రపంచ జనాభా దినోత్సవం ఘనంగా నిర్వహణ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 11)**
ప్రపంచ జనాభా దినోత్సవం 2026 సందర్భంగా వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) ఆదేశాల మేరకు ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ఏడీఎంఈ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శ్రీవాణి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ బి శ్రీదేవి మార్గదర్శకత్వంలో నోడల్ అధికారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి అశ్వన్ సమన్వయంతో శనివారం ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రజలకు కుటుంబ నియంత్రణ, పునరుత్పత్తి ఆరోగ్యం, జనాభా నియంత్రణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం పీజీ విద్యార్థులు, జూనియర్ వైద్యులు ఫ్లాష్‌మాబ్, వీధి నాటిక (స్కిట్) ప్రదర్శించి "ఉజ్వల భవిష్యత్తు కోసం కుటుంబ నియంత్రణ అనే సందేశాన్ని ప్రజలకు







చేరవేశారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జి. అస్వన్ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణలో సరైన ఎంపిక, పునరుత్పత్తి ఆరోగ్యం పరిరక్షణ, దేశ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని వివరించారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాల, ఒంగోలులో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తదనంతరం కమ్యూనిటీ మెడిసిన్ విభాగం, ప్రసూతి, స్త్రీ వైద్య విభాగం సంయుక్తంగా నిరంతర వైద్య, విద్య కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వినీల ప్రియాంక భారతదేశ జనాభా ధోరణులపై (డెమోగ్రాఫిక్ ట్రెండ్స్ ఇన్ ఇండియా), ప్రసూతి, స్త్రీవైద్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షోనిమా కుటుంబ నియంత్రణ పద్ధతులపై (ఫ్యామిలీ ప్లానింగ్ ప్రాక్టీసెస్) సమగ్రంగా ప్రసంగించి వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల సోషల్ సైన్సెస్ లెక్చరర్ రవిశంకర్, ఎంపీహెచ్ఈఓ తాళ్లూరి వెంకటేశ్వర్లు, పీజీ విద్యార్థులు డాక్టర్ మొహిద్దీన్, డాక్టర్ అరివుక్కరసు, డాక్టర్ రేష్మ, డాక్టర్ జయప్రీతి, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ హెప్సిబా, డాక్టర్ ముబీనా, డాక్టర్ జైరాం, డాక్టర్ లక్ష్మీదేవితో పాటు ఇంటర్న్ వైద్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా కుటుంబ నియంత్రణ, ఆరోగ్యకరమైన కుటుంబ జీవనం, బాధ్యతాయుతమైన తల్లిదండ్రులుగా యువతలో అవగాహన పెంపొందించడం ద్వారా సమాజంలో సుస్థిర అభివృద్ధికి దోహదపడే సందేశాన్ని ప్రజలకు చేరవేశారు.



# సర్‌ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 11)**
పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియను పక్కాగా నిర్వహిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గం ఇఅర్ఓ ఎస్ లవన్న బిఎల్ఓలకు సూచించారు. మండలంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను లవన్న ఎడి హ్యాండ్ లూమ్స్ డి వెంటేశ్వర్లుతో కలసి చిన్నగంజాం గ్రామంలో క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె ప్రభాకరరావు, సూపవైజర్ పివిఎస్ కళ్యాణ్, బిఎల్ఓలు షాలేం రాజు, హవీల, తదితరులు పాల్గొన్నారు.

# లార్డ్ కృష్ణలో ఘనంగా ప్రారంభం అయిన బ్యాడ్మింటన్ పోటీలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 11)**
ఒంగోలు లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీలో శనివారం జరిగిన 53 వ ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ 2026 జిల్లా స్థాయి అండర్ 11, 13, 15, 17, 19 బాల, బాలికల జిల్లా స్థాయి సెలక్షన్ టోర్నమెంట్ ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా శనివారం నుండి ఆదివారం వరకు జరిగిన పోటీలలో అండర్ 11, 13, 15 బాల బాలికల ప్రిలిమనరి పోటీలు నువ్వా నేనా అన్నట్టు సాగాయి. క్రీడాకారులు ఎంతో ఉత్సహంగా ఈ పోటీలలో పాల్గొన్నారు. శనివారం జరిగిన పోటీలలో విజేతలకు ఆదివారం సెమీ ఫైనల్స్, అండర్ 17, 18 మెన్స్ అండ్ ఉమెన్స్ పోటీలు జరుగుతాయని లార్డ్ కృష్ణా బ్యాడ్మింట్ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళి కృష్ణ, ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ పి విజయ కృష్ణ తెలిపారు.

# బోటు ప్రమాదంలో కందుకూరు కుర్రాడు సురక్షితం

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 11)**



వియత్నాం దేశంలో జరిగిన బోటు ప్రమాదంలో కందుకూరుకు చెందిన ఓ యువకుడు సురక్షితంగా బయటపడ్డాడు. కందుకూరులోని కీర్తి సెల్ పాయింట్ యజమాని గొల్ల శ్రీనివాస్ కుమారుడు సాయి నవీన్ 3 రోజుల క్రితం వియత్నాం పర్యటనకు వెళ్లాడు. లావా మొబైల్ కంపెనీ, మొత్తం 56 మంది మొబైల్ డీలర్లను విదేశీ పర్యటనకు తీసుకువెళ్లింది. వారిలో సాయి నవీన్ కూడా ఉన్నాడు. డీలర్లను ఒక బోటు ద్వారా సముద్రంలోనికి తీసుకువెళ్లగా, అక్కడ ప్రమాదం జరిగింది. బోటు తిరగబడటంతో 33 మంది చనిపోయారు. సాయి నవీన్ సహా కొంతమందిని కాపాడారు. ప్రస్తుతం సాయి నవీన్ సురక్షితంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది.



# ఒంగోలు టూటౌన్ సిఐగా ఎల్ వీర నాయక్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 11)**
ఒంగోలు టూ టౌన్ సిఐగా శనివారం బాధ్యతలు స్వీకరించిన ఎల్ వీర నాయక్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం టూ టౌన్ ఎస్ఐ పున్నారావు, కొత్తపట్నం ఎస్ఐ వేముల సుధాకర్, టూ టౌన్ సిబ్బంది పలువురు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.










# రామాయపట్నం పోర్టు కందుకూరు ప్రజల హక్కు

**రామాయపట్నం పోర్టు 95 శాతం పనులను పూర్తిచేసిన వైఎస్ఆర్సిపి**
**పూర్తి చేయలేక రామాయపట్నం పోర్టును ప్రైవేటు పరం చేస్తూ కూటమి ప్రభుత్వం**
**రామాయపట్నం పోర్టు పూర్తి అయితే మత్స్యకారులకు, ఆక్వారంగానికి, నిరుద్యోగులకు, రవాణా రంగానికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి**
**కందుకూరు ప్రాంత ప్రజల ఆశలను తుంగలో తొక్కిన తెలుగుదేశం ప్రభుత్వం ఎమ్మెల్యే, ఎంపీల చేతకానితనానికి నిదర్శనం పోర్టు ప్రైవేటు పరం**
**ప్రైవేటీకరణ ఆపే వరకు ప్రజల పక్షాన వైసీపీ తీవ్ర పోరాటం చేస్తుంది**
**మాజీ ఎమ్మెల్యే, కందుకూరు వైసీపీ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్**



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 11)**
కందుకూరు ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష మేరకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించి వేగంగా నిర్మించిన రామాయపట్నం పోర్టును తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు ధారాధత్తం చేయడాన్ని కందుకూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆస్తిని పప్పు బెల్లాల్లాగా ప్రైవేటు వ్యక్తులకు అమ్మటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కందుకూరు ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాల చిరకాల కోరికను సాకారమయ్యే సందర్భంలో కూటమి ప్రభుత్వం కుట్రజేసి ప్రైవేటు వ్యక్తులకు అత్యంత చవకగా అమ్మటం పేద ప్రజల పట్ల ఉన్న కపట ప్రేమకు నిదర్శనమని విమర్శించారు. రామాయపట్నం పోర్టు పూర్తి అయ్యి అనుబంధంగా పారిశ్రామిక అభివృద్ధి చెందితే నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటీ, పేద ప్రజలకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించేయని అన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. రామాయపట్నం పోర్టు ద్వారా ఆక్వారంగం ఉత్పత్తులు ఎగుమతులు వలన, మత్స్యకార రంగానికి, రవాణారంగానికి, చుట్టుపక్కల ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మేలు జరిగే పోర్టును ప్రైవేటుపరం చేసేంత దుర్మార్గమైన విషయం మరొకటి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కందుకూరు ప్రాంత ప్రజల పట్ల ఏమాత్రం గౌరవం,ప్రేమ ఉంటే తక్షణం చంద్రబాబు నాయుడు రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే మరియు పార్లమెంటు సభ్యులు ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికపై మన్ను పోసే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారి గెలుపుకు ఓట్లు వేసిన ప్రజల పట్ల ఏమాత్రం ప్రేమ ఉన్న రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణను తక్షణం ఆపాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి పరిపాలనా కాలంలో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి 95% పోర్టును పూర్తిచేస్తే మిగిలిన పనులను పూర్తి చేయలేక కూటమి ప్రభుత్వం ప్రవేటుకు తెగనమ్మడం దుర్మార్గమైన చర్య దీనివలన స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు కమిషనులకు కక్కుర్తి పడి ప్రాజెక్టు ప్రైవేటీకరణకు అంగీకరించారని తీవ్రంగా విమర్శించారు. తక్షణం ప్రైవేటీకరణను ఆపకపోతే ఈ ప్రాంత యువత, నిరుద్యోగ, కార్మిక,కర్షక, మహిళ,మేధావులను కలుపుకొని వైఎస్ఆర్సిపి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడుతుందని తీవ్రంగా హెచ్చరించారు. ప్రైవేటీకరణ ఆపే వరకు ఎన్ని ఇబ్బందులు, నిర్బంధాలు ఎదురైన కేసులు, జైలు కూడా లెక్కచేయకుండా ఈ ప్రాంత ప్రజల హక్కు కోసం ఉద్యమం ఆపేది లేనేలేదని ధ్వజమెత్తారు.

# అరుగు పై ఆర్డీవో...
# ఓటర్లతో ముచ్చట్లు..!

**పొదిలిలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన మార్కాపురం ఆర్డీవో శివరామిరెడ్డి**

**14 లోగా వివరాలు అందించాలని ఓటర్లకు విజ్ఞప్తి**



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 11)**

ప్రజల్లో కలిసిపోతూ, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించడం మార్కాపురం ఆర్డీవో, నియోజకవర్గ వీఆర్వో శివరామిరెడ్డి నైజం. శనివారం ఆయన పొదిలి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విరాట్ నగర్ లో పర్యటించిన ఆయన, అక్కడి దేవాలయం అరుగుపై స్థానికులతో కలిసి కూర్చొని ఓటర్ల సర్వే ప్రక్రియపై అత్యంత ఆత్మీయంగా అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితా నమోదు, సవరణల ప్రక్రియలో భాగంగా ఓటర్లందరూ తమ పూర్తి వివరాలను సంబంధిత బిఎల్ఓ లకు సమర్పించాలని ఆర్డీవో శివరామిరెడ్డి కోరారు. ఈ ప్రక్రియ పై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటర్లు తమ పూర్తి వివరాలను సంబంధిత బీఎల్ఓలకు సమర్పించడానికి ఈ నెల 14వ తేదీని చివరి గడువుగా నిర్ణయించారన్నారు. ఆ లోపు అర్హులైన వారందరూ తమ వివరాలను సరిచూసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన అనంతరం బిఎల్వోలు, బిఎల్ఏలు మరియు మున్సిపల్ సిబ్బందితో ఆర్డీవో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విధుల్లో అలసత్వం వహించకుండా, క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి పక్కాగా వివరాలు సేకరించాలని పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎంవి కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఆంజనేయులు, స్థానిక రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలతో ప్రజలకు మరింత

# సమర్థవంతమైన సేవలు అందించడం పోలీసు శాఖ లక్ష్యం

**ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 11)**

మిషన్ యూత్4 ప్రకాశం పోలీస్ హ్యాకథాన్ 2026 కార్యక్రమాన్ని శనివారం ప్రకాశం జిల్లా పోలీస్ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందుకొచ్చిన నిర్వాహకులను జిల్లా ఎస్పీ అభినందించారు. సాధారణంగా మహానగరాల్లో నిర్వహించే హ్యాకథాన్‌ను ప్రకాశం జిల్లాలో నిర్వహించడం అభినందనీయమని, పోలీసు శాఖతో పాటు సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాల కోసం యువత ముందుకు రావడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హ్యాకథాన్‌లో సుమారు 12 సమస్యలకు పరిష్కారాలను అన్వేషించే లక్ష్యంతో 45 జట్లు పాల్గొనడం విశేషమని తెలిపారు. ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి యువత ఉత్సాహంగా పాల్గొనడం ఈ కార్యక్రమం విజయాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. హ్యాకథాన్‌లో రూపొందించిన పరిష్కారాలను పోలీసు శాఖ అధికారులు సమగ్రంగా పరిశీలించి, పోలీసింగ్‌కు ఆచరణాత్మకంగా ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలను గుర్తించి, వాటిని పోలీసు వ్యవస్థలో అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. ఆవిష్కర్తలతో సమన్వయం చేసుకుంటూ భవిష్యత్తులో వాటి అమలుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సాంకేతికత ఆధారిత పాలనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, అదే స్ఫూర్తితో పోలీసు శాఖ కూడా టెక్నాలజీ వినియోగాన్ని మరింత విస్తృతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన సేవలు అందించే దిశగా అడుగులు వేస్తోందన్నారు. వివిధ కళాశాలలు, రాష్ట్రాల నుంచి వచ్చిన యువత తమ సృజనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణలతో పోలీసింగ్‌కు తోడ్పాటునందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని, హ్యాకథాన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపారు. ఈ మిషన్ యూత్4 ప్రకాశం పోలీస్ హ్యాకథాన్ 2026 నిర్వహణలో శ్రావణ్‌టిక్స్ టెక్నాలజీ ఎల్ఎల్‌పీ సాంకేతిక భాగస్వామిగా వ్యవహరించగా, ఓర్విన్ లెర్న్ ఎడ్‌పెల్ఎల్‌పీ ప్రధాన విద్యా, ఇంక్యుబేషన్ భాగస్వామిగా సహకారం అందించింది. యువతలో ఆవిష్కరణలు, పరిశోధన, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహిస్తూ, పోలీసింగ్‌తో పాటు సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాల అభివృద్ధికి ఈ రెండు సంస్థలు కట్టుబడి ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతిభావంతులైన యువతకు మార్గదర్శకత్వం, స్టార్టప్ ఇంక్యుబేషన్, ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించి, వారి ఆవిష్కరణలను ఆచరణలోకి తీసుకురావడానికి అవసరమైన సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ప్రకాశం జిల్లా ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఒంగోలు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఒంగోలు తాలూకా ఇన్‌స్పెక్టర్ విజయ్ కృష్ణ, ఒంగోలు రూరల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, ఒంగోలు ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ జగదీష్, శ్రావణ్‌టిక్స్ టెక్నాలజీ ఎల్ఎల్‌పీ మేనేజింగ్ పార్ట్నర్ పేర్ల మహేష్ కుమార్, ఓర్విన్ లెర్న్ ఎడ్‌పెల్ఎల్ మేనేజింగ్ పార్ట్నర్ నార్నె వెంకట ఫణీంద్ర సాయినాథ్, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.





# చెడు వ్యసనాల కోసం వరుస దొంగతనాలు నిందితుడి అరెస్ట్

# రూ.10 లక్షల విలువైన బంగారం, నగదు స్వాధీనం



**(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 11)**

చెడు వ్యసనాలకు బానిసై రాత్రి వేళల్లో నిద్రిస్తున్న మహిళల మెడలోని బంగారు గొలుసులు అపహరించడం, తాళం వేసిన దుకాణాల్లో చోరీలకు పాల్పడుతున్న ఓ నిందితుడిని మార్కాపురం జిల్లా పోలీసులు అరెస్ట్ చేసి, సుమారు రూ.10 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ యు నాగరాజు పర్యవేక్షణలో కంభం సీఐ కె మల్లికార్జున, బేస్తవారిపేట ఇన్‌చార్జి ఎస్ఐ ఏ శివకృష్ణారెడ్డి నేతృత్వంలోని ప్రత్యేక బృందం ఈ కేసులను ఛేదించింది.

**నిందితుడి వివరాలు...**

అరెస్టయిన నిందితుడు గురునాథం బ్రహ్మయ్య (24), తండ్రి చిన్న వెంకటేష్, అన్నమయ్య జిల్లా నందలూరు మండలం నల్లతుమ్మాయపల్లి గ్రామానికి చెందినవాడు.

**నాలుగు కేసుల్లో నిందితుడి ప్రమేయం...**

పోలీసుల దర్యాప్తులో భాగంగా నిందితుడు కింది కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు తేలింది. బెస్తవారిపేట మండలం పాపాయపల్లి గ్రామంలో ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ. ముండ్లమూరు మండలంలోని పెద్ద ఉల్లగల్లు, పూరిమెట్ల గ్రామాల్లో ఇంటి ముందు దోమతెరల్లో నిద్రిస్తున్న మహిళల మెడలోని బంగారు గొలుసుల అపహరణ. నాగులుప్పలపాడు మండలంలో తాళం వేసి ఉన్న షాపులో నగదు చోరీ.

**రూ.10 లక్షల విలువైన సొత్తు రికవరీ....**

నిందితుడి వద్ద నుంచి సుమారు 83 గ్రాముల బంగారు నగలు (మూడు గొలుసులు), రూ.30 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన ఆస్తి మొత్తం విలువ సుమారు రూ.10 లక్షలుగా పోలీసులు తెలిపారు.

**చోరీలకు కారణం చెడు వ్యసనాలే....**

పోలీసుల వివరాల ప్రకారం, నిందితుడు గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యాపారం చేస్తుండగా, అతని భార్య చిక్కు వెంట్రుకలు సేకరించి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యాపార ఆదాయం కుటుంబ పోషణతో పాటు మద్యం, సిగరెట్లు వంటి చెడు వ్యసనాలకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. వ్యాపారం నిమిత్తం గ్రామాల్లో తిరుగుతూ మహిళలు ధరించిన బంగారు గొలుసులను గమనించి, రాత్రి వేళల్లో నిద్రిస్తున్న సమయంలో వాటిని అపహరించేవాడని పోలీసులు తెలిపారు.

**పాత నేరచరిత్ర....**

నిందితుడి పై తెలంగాణలోని రేవల్లి పోలీస్ స్టేషన్‌తో పాటు తిరుపతి జిల్లా వెంకటగిరి, దక్కిలి, నెల్లూరు జిల్లా సుళ్లూరుపేట పోలీస్ స్టేషన్లలో కూడా దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. ఆయా కేసులు ప్రస్తుతం కోర్టుల్లో విచారణలో ఉన్నాయి. ఇటీవల మహబూబ్‌నగర్ జైలు నుంచి విడుదలైన అనంతరం మళ్లీ దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.

**కోనపల్లి క్రాస్‌రోడ్డు వద్ద అరెస్ట్...**

జూలై 9 సాయంత్రం కోనపల్లి క్రాస్‌రోడ్డు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు...**

కేసును విజయవంతంగా ఛేదించిన కంభం సీఐ కె మల్లికార్జున, ఇన్‌చార్జి ఎస్ఐ ఏ శివకృష్ణారెడ్డి, అలాగే పోలీసు సిబ్బంది ఎం వెంకటేశ్వర్లు, ఎం అంకయ్య, ఎం వెంకటేశ్వర్లుతో పాటు దర్యాప్తులో పాల్గొన్న బృందాన్ని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# బద్వేల్ టిడిపి ఇన్చార్జ్‌గా సూర్యనారాయణరెడ్డి నియామకం అభినందనీయం

**సొల్లేటి వెంకటరమణ, చల్ల వేణుగోపాల్‌రెడ్డి హర్షం**

**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జులై 11)**



బద్వేల్ నియోజకవర్గం లోని ప్రముఖ సీనియర్ కాంట్రాక్టర్‌గా మంచూరు సూర్యనారాయణ రెడ్డి అనేక సంవత్సరాలుగా ప్రజలకు చేసిన సేవలకు గుర్తింపుగా వారికి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్గా నియమించడం జరిగింది. కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ గా ఉన్నటువంటి మంచూరు సూర్యనారాయణ రెడ్డి గడిచిన కొంతకాలంలోనే బద్వేల్ ప్రాంతంలో అనేక దేవాలయాలకు, అనారోగ్యం, ఇతర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నటువంటి వారందరికీ అండగా ఉండి వారి కి అవసరమైన ఆర్థిక సహాయ సహకారాలు చేయడంలో వారు బద్వేల్ ప్రాంతంలో పలువురు ప్రజలు ఆదరభిమానాలు పొందారు. వారి సేవలకు గుర్తింపుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ వారిని బద్వేల్ నియోజకవర్గ ఇన్చార్జిగా మంచూరు సూర్యనారాయణరెడ్డి పేరు ప్రకటించడం అభినందనీయమని ప్రముఖ ఆర్యవైశ్య ప్రముఖులు సొల్లేటి వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు. శనివారం బెంగళూరు నగరంలోని కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డికి బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జిగా టిడిపి అధిష్టానం నుంచి ఉత్తర్వులు వచ్చిన సందర్భంగా వారిని బెంగళూరులో చల్లా వేణుగోపాల్‌రెడ్డి, సొల్లేటి వెంకటరమణలు సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం చల్ల వేణుగోపాల్‌రెడ్డి, ఆర్యవైశ్య ప్రముఖులు సొల్లేటి వెంకటరమణలు మాట్లాడుతూ మంచూరు సూర్యనారాయణరెడ్డి కాంట్రాక్టర్‌గా అనేక సంవత్సరాలుగా ఉంటూ అనేక మంది సబ్ కాంట్రాక్టర్‌లను దగ్గరికి తీసి వారు ఉన్నతికి ఎంతగానో కృషి చేశారన్నారు. అలాగే అట్లూరు మండలం, బద్వేల్ నియోజకవర్గ స్థాయిలో ఎవరికి ఏ కష్టం వచ్చినా వారికి అండగా ఉంటూ వారు అందించిన సేవలకు గుర్తింపుగా నేడు బద్వేల్ నియోజకవర్గ ఇన్చార్జిగా టిడిపి అధిష్టానం ఉత్తర్వులు జారీ చేయడం ఎంతో సంతోష్ కరమన్నారు. భవిష్యత్తులో రాష్ట్రస్థాయిలో పదవులు అలంకరించాలని, బద్వేల్ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరాయంగా కృషి చేస్తూ ఉండాలని వారు ఆకాంక్షించారు. అనంతరం వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

## పల్లకీ సేవలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవారు

# గోవిందా, గోవిందా అంటూ గోవింద నామస్మరణలతో మారుమోగిన కాలనీ







(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జులై 11)

బద్వేల్ పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీవారి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయని ఆలయ ఆలయ ధర్మకర్త వల్లంకొండు వెంకటరమణ, సెక్రెటరీ అంకయ్య, గౌరవ అధ్యక్షులు త్రివిక్రమ్ సింగ్, పలువురు కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ఆలయ ఆవరణల అర్చకులు సుదర్శన సోమశేఖర్ స్వామి అర్చక బృందం నేతృత్వంలో శాస్త్రోక్తంగా చతుర్థనార్చన, లక్ష్మీ హయగ్రీవ హోమం, వేద స్వస్తి, నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పూలతో అలంకరించిన పల్లకీలో కొలువుతీర్చి గజమాలలతో అలంకరించి మంగళవాయిద్యాలతో బద్వేల్ పట్టణ పురవీధుల్లో విహరింపజేశారు. భక్తులు గోవింద నామస్మరణతో స్వామివారికి టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న భక్తులను శ్రీవారు కటాక్షించారు. స్వామివారి పల్లకి సేవలో పలువురు భక్తులు మంచినీరు వారు పోసి అడుగడుగున భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తమ భక్తిని చాటుకున్నారు,ఈ కార్యక్రమంలో కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్, కుప్పం సుధాకర్, మాలేపాటి సుధాకర్, వల్లం కొండు రాఘవేంద్ర, అనిత్, బచ్చు సందీప్, దిండుకుర్తి చరణ్, మురళి,ప్రైవేట్ సర్వే పెంచలయ్య, మలే పెంచల్ రెడ్డి, తాతనబోయిన వెంకటసుబ్బయ్య, నిమ్మకాయల శివారెడ్డి, గంగిరెడ్డి, బండారు సురేష్ బాబు, పత్తి హరీష్, చీదెళ్ళ రమణయ్య, సిద్దయ్య, లేబాకు సుబ్బరాయుడు, పరిటాల వెంకటేశ్వర్లు, దాసా సతీష్‌తో పాటు పలువురు మహిళలు, ప్రముఖులు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

---

## ప్రమాదాల ముంగిట సాయి సమన్వి హాస్పిటల్ సందు ‘ఆంగ్యులర్స్’ జాయింట్లతో నెట్టుకొస్తున్న విద్యుత్ శాఖ



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 11)

పట్టణంలోని బద్వేల్ రోడ్డులో ఉన్న శ్రీ సాయి సమన్వి హాస్పిటల్ సందు గుండా వెళ్లాలంటేనే స్థానికులు, రోగులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఇక్కడి వీధిలో



విరిగిపోయిన ఒక విద్యుత్ స్తంభాన్ని పూర్తిగా తొలగించి, కొత్త స్తంభాన్ని వేయాల్సింది పోయి... విద్యుత్ శాఖ అధికారులు కేవలం ‘ఆంగ్యులర్స్’ (ఇనుప పట్టీలు) వేసి జాయింట్ చేసి చేతులు దులుపుకున్నారు.

**భయంలో రోగులు, స్థానికులు...**

హాస్పిటల్ ప్రాంతం కావడంతో ఇక్కడికి నిత్యం వందలాది మంది రోగులు, వృద్ధులు, మహిళలు వస్తుంటారు. ఎప్పుడు ఏ చిన్న గాలివాన వచ్చినా ఈ అతుకుల స్తంభం విరిగి ఎవరి నెత్తిన పడుతుందోనని స్థానికులు, బాటసారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చికిత్స కోసం హాస్పిటల్‌కు వస్తే... ఇక్కడున్న కరెంట్ స్తంభం చూసి ప్రాణభయంతో రోగం మరింత ఎక్కువవుతోంది అని పలువురు రోగులు వాపోతున్నారు.

**తూతూమంత్రపు పనులతో సరిపెడతారా?**

విద్యుత్ శాఖకు ప్రతి నెలా బిల్లులు కడుతున్న ప్రజల ప్రాణాలంటే అధికారులకు అంత చులకనా? అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విరిగిన స్తంభాన్ని మార్చడానికి అయ్యే ఖర్చు కంటే... రేపు ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవిస్తే జరిగే నష్టం ఊహించగలరా? ఇలాంటి తాత్కాలిక ‘అతుకుల’ వైద్యం విద్యుత్ శాఖకే చెల్లిందని స్థానికులు సున్నితంగా విమర్శిస్తున్నారు.

**అధికారులారా... స్పందించండి!**

ఈ తీవ్రమైన సమస్య పై మైదుకూరు విద్యుత్ శాఖ ఏడీఈ, ఏఈలు ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రమాదం జరిగాక స్పందించడం కంటే ముందే అప్రమత్తమై ఆ అతుకుల విద్యుత్ స్తంభాన్ని వెంటనే తొలగించి, దాని స్థానంలో సరికొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని హాస్పిటల్ యాజమాన్యం, స్థానిక ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

---

## జాతీయ లోక్ అదాలత్ లో 1380 కేసులు పరిష్కారం

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 11)

కనిగిరి కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు.కనిగిరి కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 1380, కేసులు పరిష్కారం అయినట్లు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి. రూపశ్రీ తెలిపారు. ఈసందర్బంగా క్రిమినల్ కేసులు 97, సివిల్ కేసులు 12, భరణం కేసులు 3,, చెక్ బౌన్స్ కేసులు 3,ఎస్ టి సి 1265 కేసులను ఇరువర్గాల వారిని రాజీ కుదిర్చి పరిష్కరించినట్లు జడ్జి తెలిపారు.కక్షలు, వెళ్లకుండా రాజీ మార్గంలో వెళ్లి రాజ మార్గాన్ని అనుసరించాలని రాజీ మార్గమే రాజ మార్గం అని లోక్ అదాలత్‌లో రాజీ పడితే ఇరు వర్గాలు గెలిచినట్లే అని కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి బి రూపశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.




---

## శ్రీ హర్షిణి కాలేజీ విద్యార్థుల ఘన విజయం

### ఐసీఐసీఐ బ్యాంక్ ఉద్యోగాలకు 32 మంది ఎంపిక

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 11)

స్థానిక శ్రీ హర్షిణి డిగ్రీ డ పిజి కాలేజీ విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్స్‌లో సరికొత్త రికార్డు సృష్టించారు. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన ఐసీఐసీఐ నిర్వహించిన ప్రతిష్టాత్మక ప్రాంగణ ఎంపికల (క్యాంపస్ ప్లేసెమెంట్ డ్రైవ్ ) లో కాలేజీకి చెందిన 32 మంది విద్యార్థులు ఒకేసారి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ. 3.8 లక్షల (3.8 ఎల్‌పీఏ) ఆకర్షణీయమైన ప్యాకేజీ లభించినట్లు కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా హర్షిణి విద్యాసంస్థల చైర్మన్ శ్రీ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ, బ్యాంకింగ్ మరియు సాఫ్ట్ వేర్ రంగాలలో ఉన్న అపారమైన అవకాశాలను అందుకొనేలా విద్యార్థులను కాలేజీలోనే ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కేవలం అకడమిక్ చదువులే కాకుండా.. కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్, ఇంటర్వ్యూ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలపై నిరంతరం శిక్షణ ఇవ్వడం వల్లే ఉద్యోగాలు సాధించగలిగారని ఆయన కొనియాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసిన అధ్యాపక బృందాన్ని, ప్లేస్‌మెంట్ విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ఎండీ గోరంట్ల హర్షిత్, డీన్ దాది ఆంజనేయులు, జీఎం ఆర్ల శివరాం, ప్రిన్సిపల్ నాగేంద్ర, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.



---

## వైసీపీ ఎస్టీ మహిళా నాయకురాలు ప్రసన్నని పరామర్శించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 11)

ఒంగోలులో ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఘర్షణ అనంతరం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పార్టీ ఎస్టీ విభాగానికి చెందిన మహిళా నాయకురాలు ప్రసన్నను ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ పరామర్శించారు. ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న అనంతరం మీడియాతో మాట్లాడిన శైలజ... మహిళలు రాజకీయాల్లో గౌరవం, భద్రతతో పనిచేసే వాతావరణం కల్పించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రసన్నకు గత ఏడాది కాలంగా అసభ్యకర వ్యాఖ్యలు, లైంగిక వేధింపులు ఎదురయ్యాయని తెలిసిందన్నారు. బాధితురాలిని న్యాయం గురించి అడగగా, పార్టీ ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక వచ్చిన తర్వాత తనకు న్యాయం చేయాలని కోరుతానని ఆమె చెప్పినట్లు వివరించారు. రాజకీయాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ చులకనగా చూడకూడదన్నారు. రాజకీయంగా ఎదగాలనే ఆశతో, పార్టీపై నమ్మకంతో పనిచేసే మహిళలకు ప్రోత్సాహం అందించాల్సిందే కానీ, అవమానాలకు గురిచేయడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలు జరగడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్న రాయపాటి శైలజ ఏ సమస్య వచ్చినా మహిళలు ఆవేశపూరిత నిర్ణయాలకు వెళ్లకుండా చట్టబద్ధమైన మార్గాల్లో న్యాయం కోసం పోరాడాలని సూచించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఘటన తర్వాత తనను ఒంటరిగా వదిలేశారనే బాధను ప్రసన్న వ్యక్తం చేసిందని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మ సునంద, వన్ స్టాప్ సెంటర్ నిర్వాహకురాలు ఎన్ సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

## అధిక సంఖ్యలో కేసుల పరిష్కారం

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్యానంద**




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 11)

జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రకాశం జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి సహకరించిన కక్షిదారులకు న్యాయవాదులకు పోలీస్ శాఖ వారికి, ఇతర ప్రభుత్వ శాఖలకు ప్రత్యేక అభినందనలు అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్ ,జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్యానంద అన్నారు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 21,715 రాజీ పడదగిన క్రిమినల్ కేసులు 190 సివిల్ వ్యాజ్యాలు ఫ్రీ లిటిగేషన్ స్థాయిలో 14 కేసులు పరిష్కరించడం జరిగిందని, వివిధ కేసులలో కక్షిదారులకు కాంపెన్సేషన్ రూపంలో రూ.5.50 కోట్లు అందించే విధంగా ఆర్డర్లు రూపొందించడం జరిగిందని జిల్లావ్యాప్తంగా న్యాయవాదులు, న్యాయమూర్తులు ఏర్పాటు చేసిన 27 బెంచీలలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.